నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
ఆదివారం | 30 జూన్ 2024 | www.navatelangana.com

భవనాలను పరిశీలించిన జిల్లా జడ్జి లక్ష్మీ శారద



నవతెలంగాణ- తూప్రాన్ : తూప్రాన్ మున్సిపల్ పరిధిలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయుటకు సంబంధించిన భవనాలను జిల్లా జడ్జి లక్ష్మీశారద శనివారం పరిశీలించారు. పుట్టకోట స్కూల్ దగ్గర ఉన్న బీసీ, ఎస్సీ హాస్టల్ భవనాలను, నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ (వెజ్ అండ్ నాన్వెజ్) మార్కెట్ ను జిల్లా జడ్జీ లక్ష్మీశారద పరిశీలించారు. జూనియర్ సివిల్ కోర్టు ఏ భవనంలో ఏర్పాటు చేయాలనేది త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తూప్రాన్‌కు కోర్టు మంజూరు అవడంతో పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ కూడా త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. తూప్రాన్ డివిజన్ పరిధిలోని ప్రజలందరికీ జూనియర్ సివిల్ కోర్టు ద్వారా సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి క్రిష్ణ, వైస్ చైర్మెన్ నందాల శ్రీనివాస్,, కౌన్సిలర్లు రవీందర్ గుప్తా, తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసిల్దార్ విజయలక్ష్మి, తూప్రాన్ డీఎస్పి వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, ఆర్ అండ్ బి అధికారులు, న్యాయవాదులు, నాయకులు నాగరాజు గౌడ్, అనిల్, ఉమర్, సత్యనారాయణ, నాగులు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదవశాత్తు కాలువలో పడి జీపీ కార్మికుడు మృతి



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో మల్టీ పర్పస్ కార్మికునిగా పనిచేస్తున్న చిట్కుల్ గ్రామానికి చెందిన జగ్గంపేట ప్రకాష్ ప్రమా దవశాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. గ్రామంలోని మురుగు కాలువలు శుభ్రం చేస్తుండగా.. ప్రమా దవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఈ విష యాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్యకు తెలపడంతో ఆమె ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. విషయాన్ని ఎంపీడీవో, ఎంపీఓ, డిఎల్పికి తెలిపారు. జోగిపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై అరుణ్ కుమార్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ నుంచి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి, కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

పంట రుణం అరకొరే



- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇవ్వని బ్యాంకర్లు
- పంట రకం కాకుండా విస్తీర్ణం బట్టి అప్పు
- పర్యవేక్షణకు లీడ్ బ్యాంక్‌కు సిబ్బంది కరువు
- బుక్ అడ్జస్ట్‌మెంట్‌కే ప్రాధాన్యత

2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎకరానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించిన పంట రుణం

పంట రకం	2024-25
వరి	రూ.43000-45000
పత్తి	రూ.44000-46000
చెరకు	రూ.64000-66000
మొక్కజొన్న	రూ.26000-28000
సోయాబీన్	రూ.26000-28000
కంది	రూ.19000-21000
జొన్న	రూ.17000-19000
పెసర	రూ.16000-18000
మినుము	రూ.15000-17000

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రైతులకు పంట రుణాలు అరకొరే అందుతున్నాయి. సాగు చేసే పంట రకాన్ని బట్టి కాకుండా భూమి విస్తీర్ణాన్ని బట్టి అప్పు ఇస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించిన పంట రుణాలు అందని ద్రాక్ష అయ్యాయి. పర్యవేక్షించాల్సిన లీడ్ బ్యాంక్‌కు సిబ్బంది కవరు. మేనేజర్ ఒక్కరే జిల్లాల్లోని అన్ని బ్యాంకులను కో-ఆర్డినేట్ చేయాలి. వెరసి పంట రుణం చాలక పెట్టుబడుల కోసం రైతులు ప్రయివేట్ అప్పు చేయకతప్పట్లేదు. రూ.2 లక్షల రుణమాఫీ పేరిట ఖరీఫ్ సీజన్ పంట రుణాలిస్తున్నదిలేదు. పాత అప్పులే పేరుకుపోయి ఉండడంతో బ్యాంకర్లు వడ్డీ కట్టుకుని రెన్యూవల్ చేయడం తప్ప రైతు చేతికి నగదు ఇస్తున్నదిలేదు.

రైతులు పండించే పంట రకాల్ని బట్టి పెట్టుబడి పెట్టాల్సి ఉంటది. వాణిజ్య పంటల సాగుకు అధికంగా పెట్టుబడి పెట్టాలి. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రకాల పంటల సాగును బట్టి పెట్టుబడి అవుతుంది. అందుకే జాతీయ స్థాయిలో ఆయా రాష్ట్రాల్లో వివిధ రకాల పంటలకయ్యే పెట్టుబడిని బట్టి బ్యాంకర్లు పంట రుణాలివ్వాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించిన మేరకు ఆయా బ్యాంకర్లు విధిగా రైతులకు పంట రుణాలివ్వాలి. ఏఏ పంటలు సాగు చేస్తే ఎంత రుణం ఇవ్వాలనేది నిర్ణయించి బ్యాంకర్లకు నివేదిస్తారు. ఆ పద్ధతి ప్రకారం రుణాలిచ్చే విధంగా జిల్లా స్థాయిలో బ్యాంకర్ల సమావేశాలు నిర్వహించి ఖరారు చేస్తారు. స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ ఆమోదించిన ప్రకారం రుణాలిచ్చేలా జిల్లా స్థాయిలో లీడ్ బ్యాంకు పర్యవేక్షించాలి. ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పంటల రుణాల పరిస్థితిని పరిశీలిస్తే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించిన ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా బ్యాంకర్లు రుణాలిస్తున్నారు. సాగు చేసే పంట రకాన్ని బట్టి కాకుండా భూమి విస్తీర్ణాన్ని బట్టి ఇస్తున్నారు. కొన్ని చోట్ల గంప గుత్తగా అప్పు ఇస్తున్న పరిస్థితి ఉంది. ఏడాదిగా రూ.2 లక్షల రుణమాఫీ పథకం గురించి రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెల్లగా రుణమాఫీ చేస్తామంటూ ప్రకటిస్తున్నారు. దీంతో బ్యాంకర్లు కొత్తగా రైతులకు పంట రుణాలివ్వట్లేదు. చాలా చోట్ల పాత అప్పులకే వడ్డీ కట్టించుకుని బుక్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నారు. ఏ రైతుకూ నగదుగా చేతికిస్తున్న దిలేదు. పైగా ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే పత్తి, ఇతర మెట్ట పంటల సాగు పనులు జరుగుతున్నాయి. వరి నాట్లు కూడా జులై మొదటి వారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంత వరకు బ్యాంకర్లు ఖరీఫ్ రుణాల గురించి పట్టించుకోవడంలేదు. ఆగస్టు 15లోపు రుణమాఫీ అయితే ఆ తర్వాత కొత్తగా రుణాలిస్తలేరు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం...

2024-25 ఆర్థిక సంవత్సరంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పంట రుణాలను నిర్ణయించింది. వివిధ రకాల పంటలకు ఎకరాలకు ఎంత రుణం ఇవ్వాలో ఖరారు చేసి బ్యాంకర్లకు సిఫార్సు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో వరికి ఎకరాలకు రూ.43 వేల నుంచి 45 వేల వరకు ఇవ్వాలని, పత్తికి రూ.44 వేల నుంచి 46 వేలు ఇవ్వాలని ఖరారు చేసింది. చెరకు పంటకు రూ.64 వేల నుంచి 66 వేలు, మొక్కజొన్నకు రూ.26 వేల నుంచి 28 వేల వరకు, సోయాబీన్‌కు కూడా రూ.26 వేల నుంచి 28 వేలు, కంది పంటకు ఎకరాలకు రూ.19 నుంచి 21 వేల వరకు, పెసరకు రూ.16 నుంచి 18 వేలు, మినుము పంటకు రూ.15 నుంచి 17 వేల వరకు, జొన్న పంటకు రూ.17 నుంచి 19 వేల వరకు పంట రుణాలివ్వాలి.

విస్తీర్ణాన్ని బట్టి రుణం

వివిధ రకాల పంటల సాగుకు ఎకరాలకు అయ్యే ఖర్చుల్ని సగటున లెక్కించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పంట రుణాన్ని నిర్ణయించింది. ఆ మేరకు బ్యాంకర్లు రుణాలిచ్చినా మార్కెట్‌లో నిత్యం పెరిగే డీజిల్, ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరలు, లేబర్ ఛార్జీలతో పోల్చినా సరిపోవు. అయితే బ్యాంకర్లు మాత్రం పంట రకాన్ని బట్టి రుణం ఇవ్వకుండా గంపగుత్తగా ఎకరాకు ఇంత అని రుణమిస్తున్నారు. అత్యధికంగా వరి, పత్తి పంటలే సాగవుతున్నాయని చెప్పి ఎకరాకు రూ.30 నుంచి రూ.35 వేల వరకు రుణమిస్తున్నారు. జొన్న, పెసర, మినుము, కంది వంటి మెట్ట పంటలకు బ్యాంకర్లు రుణాలే ఇవ్వని పరిస్థితి ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 వేల ఎకరాల్లో చెరకు పండుతుంది. ఎకరాకు రూ.66 వేల రుణమివ్వాల్సి ఉండగా రూ.50 వేలు కూడా ఇవ్వడంలేదు. ఏటా ఇంత పెంచుకుంటూ పోతామంటూ దాటవేస్తున్నారు.

బుక్ అడ్జస్ట్‌మెంట్‌కే ప్రాధాన్యత

పంటల సాగుకు కావాల్సిన పెట్టుబడి సొమ్ము కోసం బ్యాంకుకు వెళ్లితే తొలుత అప్పు ఇస్తున్నారు. ప్రతి సీజన్‌లో అప్పు అసలు, వడ్డీ కలిపి చెల్లించాలి. సమయానికి పంట డబ్బులు చేతికందకపోయినా ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట దెబ్బతిన్నా రైతులు సకాలంలో అప్పు కట్టలేకపోతున్నారు. పైగా ప్రభుత్వాలు పంట రుణాల్ని మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ఆశతో రైతులు వడ్డీ మాత్రమే చెల్లిస్తారు. అలా పంట రుణాల రెన్యూవల్ పేరిట రైతుల నుంచి వడ్డీ కట్టించుకుని పాత అప్పు చెల్లించినట్లుగా కొత్తగా అప్పు తీసుకున్నట్లుగా బుక్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నారు. ఇలా అలావాడు పడిన రైతుల చేతికి అప్పు తీసుకున్న మొదటి సారి తప్ప ఏనాడూ నగదు రైతులకిచ్చిందిలేదు. కొందరు సకాలంలో వడ్డీ కట్టి బుక్అడ్జస్ట్‌మెంట్ చేసుకోని వాళ్ల ఖాతాల్ని డిఫాల్టర్స్ జాబితాలో చేరుస్తారు.

పంటల సాగు ఇలా...

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వరి అత్యధికంగా సాగవుతుంది. ఖరీఫ్ సీజన్‌లో 829113 ఎకరాల్లో సాగు కానుంది. పత్తి పంట 5.90 లక్షల ఎకరాలు, చెరకు 50 వేల ఎకరాలు, కంది 1.50 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 30 వేల ఎకరాలు, సోయాబీన్ 1.60 లక్షల ఎకరాలు, పెసర, మినుము, జొన్న వంటి పంటలు సాగవుతాయి. సంగారెడ్డి జిల్లాలో ఉల్లి 2 వేల ఎకరాలు, ఆలుగడ్డ 12 వేల ఎకరాలు, 2 వేల ఎకరాల్లో అల్లం సైతం సాగవుతుంది.

అమలు కాని ఖరీఫ్ రుణ ప్రణాళికలు

ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ రుణాలివ్వాలని ప్రణాళికలు రూపొందించారు. రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో బ్యాంకర్లు పాత అప్పుల చిట్టాలు రడీ చేస్తున్నారు. ఇప్పటికే పత్తి విత్తనాలు వంద శాతం వేశారు. వరి నార్లు కూడా 50 శాతం పోశారు. పత్తి సాగుకు సగం పెట్టుబడి విత్తనాలు, దుక్కుల దున్నకం, విత్తనం విత్తే పనులకే కావాలి. ఇతర పంటల సాగు పనులు జరుగుతున్నా కొత్తగా రుణాలిచ్చే పరిస్థితిలేదు. రుణమాఫీ ప్రక్రియ పూర్తయితే తిరిగి కొత్త రుణాలివ్వనున్నారు.

ట్రాలీ ఆటో దొంగిలించి..
పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎంలో చోరీ యత్నం



నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఓ పక్క ట్రాలీ ఆటోలు దొంగిలించి మరోపక్క అదే రోజు పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఏటీఎం పగలగొట్టి చోరీకి యత్నించిన వ్యక్తిని గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన గజ్వేల్ పట్టణంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అలీ బాబా అలియాస్ మహమ్మద్ ములుగు మండలం వంటిమామిడిలో నివాసముంటున్నాడు. అదే గ్రామానికి చెందిన నేతి నాగరాజు ట్రాలీ ఆటో దొంగలించుకొని పోయాడు. అదేరోజు రాత్రి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎటిఎంను పగలగొట్టి అందులోని డబ్బులను దొంగలించుకుని వెళ్లే ప్రయత్నం చేసేందుకు యత్నించాడు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు గజ్వేల్ అడిషనల్ ఇన్స్పెక్టర్ ముత్యంరాజు సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. పరిశోధనలో భాగంగా టెక్నాలజీ ఉపయోగించి నిందితున్ని అరెస్టు చేసి దొంగలించిన ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకుని, రెండు కేసులను నమోదు చేసి జ్యుడిషియల్ డిమాండ్‌కు పంపించారు. ఈ కేసును టెక్నాలజీతో చాకచక్యంగా చేదించినందుకు గజ్వేల్ ఇన్స్పెక్టర్ సైదా, అడిషనల్ ఇన్స్పెక్టర్ ముత్యం రాజు, క్రైమ్ పార్టీ సిబ్బందిని, గజ్వేల్ ఏసిపి కే పురుషోత్తం రెడ్డి అభినందించారు.

గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్ట్



ముగ్గురు నిందితులను అరెస్టు
330 గ్రాముల గంజాయి, 2 మోటర్ సైకిల్లు, 2 మొబైల్ ఫోన్‌ల స్వాధీనం.
గజ్వేల్ సీఐ సైదా

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

గంజాయి ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేస్తున్న ముఠాను గజ్వేల్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం గంజాయి సప్లై చేస్తున్న ముఠాను పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గజ్వేల్ సీఐ బి. సైదా మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలను అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. టంగుటూరి శివానంద్ (గజ్వేల్), కుల్దీప్ సింగ్ (దూల్పేట హైదరాబాద్.), అనిత భాయ్ భరత గోపి సింగ్ (దూల్పేట. హైదరాబాద్)లు కల్లు డిపో, హెూటళ్లు, గ్రామాలలో సంచరిస్తూ గంజాయిని అమాయకులకు కట్టబెట్టి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఆదేశానుసారం గజ్వేల్ ఏసిపి కే. పురుషోత్తం రెడ్డి, ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్నామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు, అసాంఘిక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గజ్వేల్ పట్టణం పిడిచేడ్ రోడ్ శివాజీ స్టాచ్ సమీపంలో నిందితుడు టంగుటూరి శివానంద్ గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని అందిన సమాచారం మేరకు అడిషనల్ సీఐ ముత్యంరాజు, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు, సిబ్బందితో కలిసి వెళ్లి నిందితున్ని పట్టుకున్నామన్నారు. అతని వద్ద 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితున్ని గంజాయి గురించి విచారించగా మిగతా ఇద్దరి నిందితుల పేర్లు తెలిపారన్నారు. వారిని గౌరారం బస్టాండ్ సమీపంలో చాకచక్యంగా పట్టుకొని వారి వద్ద నుంచి 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించామన్నారు. గ్రామాలలో, హెూటళ్లల్లో, కల్లు డిపోల వద్ద ఇతర ప్రదేశాలలో ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్లు, కలిగి ఉన్నారని సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలు ఏం చేస్తున్నారో ఎక్కడికి వెళుతున్నారని వారి కదలికలపై ఒక కన్నేసి ఉంచాలని తెలిపారు. గ్రామాలలో మరే ఇతర ప్రదేశాలలోనైనా గంజాయి కలిగి ఉన్నా, విక్రయించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

......
106

ఫైర్ సేఫ్టీ లేకుండా నడుస్తున్న ఐడియల్ స్కూల్

బాత్రూం లీకేజ్‌లతో క్లాసులో కూర్చోలేని విద్యార్థులు
అర్హత లేని టీచర్లతో విద్యాబోధన
ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు జగన్



నవతెలంగాణ-మనోహరాబాద్

ఫైర్ సేఫ్టీ లేకుండా పైన అంతస్తు బిల్డింగు పర్మిషన్ లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నారని వెంటనే జిల్లా అధికారి డీఈఓ పర్యవేక్షణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు జగన్ అన్నారు. తూప్రాన్ మండల కేంద్రంలో ఐడియల్ స్కూల్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐడియా స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ తూప్రాన్ మండల కేంద్రంలో ఐడియా స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందని, ఫైర్ సేఫ్టీ లేకుండా బిల్డింగ్ పర్మిషన్ లేకుండా క్లాసులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బాత్రూంల లీకేజీ వల్ల వచ్చే దుర్వాసనతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు బిల్డింగ్ మొత్తం కూడా ఎక్కడికక్కడ వాటర్ లీకేజీతో కూలిపోయే పరిస్థితికి వచ్చిందన్నారు. అయినప్పటికీ స్కూల్ యాజమాన్యం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని టీచర్లతో విద్య బోధన చేయిస్తున్నారని, ఈ విషయమై స్కూల్ యజమాన్యంతో మాట్లాడగా ఏమి చేసుకుంటారో చేసుకోండని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారన్నారు. ఫైర్ సేఫ్టీ, స్కూల్లో ఫర్నిచర్ లేకుండా క్లాసులు నిర్వహిస్తున్న ఐడియా స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని, లేని పక్షంలో మండలంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తూప్రాన్ డివిజన్ కార్యదర్శి కార్తీక్, నాయకులు రమేష్ , పోచయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వాహణలో చేసిన సేవలు గుర్తుండిపోతాయి



నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వాహణలో చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. న్యాల్కల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇంద్రసేనారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హద్నూర్ ఎస్ఐ రాము నాయుడు, వివిధ పార్టీల నాయకులు, ఆయా పాఠశాల హెచ్ఎంలు, తోటి ఉపాధ్యాయ బృందం ఇంద్రాసేనారెడ్డిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సచ్చిదానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు తిరుపతి రెడ్డి, సిద్ధి లింగయ్య స్వామి, గిరీష్ జోషి, శ్రీశైలం, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, పాండయ్య, సుధాకర్, పాఠశాల చైర్మెన్ మల్లీశ్వరి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్‌లు పెంచి.. వెంటనే అమలు చేయాలి

- పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వ వాటా పెంచాలి
- సమస్యల పరిష్కారానికి జులై 3న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు
- ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



నవతెలంగాణ-జోగిపేట

ఆసరా పెన్షన్స్ పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300 నుంచి రూ.3000లకు పెంచాలని డిమాండ్ చేస్తూ జులై 3న కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎన్పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య తెలిపారు. ఈ మేరకు జోగిపేట పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అందోల్ డివిజన్ సదస్సు డివిజన్ అధ్యక్షులు పి.సుభాష్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. పెన్షన్‌లకు కేంద్ర ప్రభుత్వం వాటా 2011 నుంచి కేవలం రూ.300 మాత్రమే ఇస్తున్నదన్నారు. నిత్యావసర సరకుల ధరలు గడిచిన 13ఏండ్ల కాలంలో 300 రేట్లు పెరిగాయన్నారు. ధరల పెరుగుదల సూచికి అనుగుణంగా పెన్షన్స్ ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. వాటా పెంచకుండా వికలాంగుల గురించి మాట్లాడే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వికలాంగుల పెన్షన్‌ను రూ.6000, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పెన్షన్స్ రూ.4000లకు పెంచుతామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని.. ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా.. ఎందుకు పెంచడ లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయం కోసం 44,49,767 మంది ఆసరా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణం, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, 2016ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం అమలు వంటి వాటిని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన 24.84 లక్షల మందికి వెంటనే పెన్షన్స్ మంజూరు చేయాలన్నారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్ వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. 2016ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం కొత్తగా గుర్తించిన 14రకాల వైకల్యాలకు సదరం సర్టిఫికెట్స్ ఇచ్చే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసరా పెన్షన్ లలో కేంద్ర ప్రభుత్వం వాటా పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జులై 3న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ధర్నాల్లో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయమ్మ, జిల్లా అధ్యక్షులు బస్వారాజు పాటిల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల. మల్లేశం, ప్రచార కార్యదర్శి మన్నే పోచ య్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బుక్క ఇస్మాయిల్, నాయకులు ఇస్మాయిల్, రాంచందర్,రమాదేవి, కృపావర్మ, శ్రీనివాస్ గౌడ్, నర్సిములు, యదులు, జయమ్మ, చెన్నయ్య, యాదగిరి, వీరేష్, గణేష్, అబేద్, ఉస్మాన్, వికలాంగులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో పాము కలకలం



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

మేజర్ గ్రామ పంచాయతీ అయిన పెద్ద శంకరంపేట పంచాయతీ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం పాము కలకలం రేపింది. పంచాయతీలోని ఈవో కార్యాలయంలో పంచాయతీ సిబ్బంది మంచినీరు త్రాగడానికి వెళ్తున్న క్రమంలో పెద్ద పాము కనబడడంతో సిబ్బంది వెంటనే పరిగెత్తుతూ బయటకు వచ్చారు. వెంటనే సిబ్బంది బయటి వారికి, స్థానికులకు తెలియజేయగా పలువురు వెంటనే వచ్చి పామును చంపేశారు. పాము దాదాపు మీటర్‌కు పైగా ఉంటుందని.. గతంలో సైతం పంచాయతీ కార్యాలయంలో ఇలాంటి పెద్ద పాములు వచ్చాయని సిబ్బంది పేర్కొన్నారు. దీంతో తాము భయబ్రాంతులకు గురవుతున్నామని సిబ్బంది తెలిపారు.

అర్హులకు అందని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

సమగ్రం దర్యాప్తు చేయాలి
గజ్వేల్ పట్టణంలో గతంలో ఇచ్చిన పట్టాలతో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా
సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

గజ్వేల్ పట్టణంలో డబల్ బెడ్ రూమ్ ఎంపిక సక్రమంగా జరగలేదని అనర్హుల పేర్లు జాబితాలో ఎక్కించడం జరిగిందని వాటిని తొలగించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు గతంలో ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లతో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ స్థానికంగా రేషన్ కార్డులు గుర్తింపు కార్డులు లేకున్నా మరి సొంతంగా స్థలాలు భూములు బిల్డింగులు కలిగినవారికి గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్‌లలో ఎంపిక చేయడం జరిగిందన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించాలని అర్హులు అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే కలెక్టర్, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వెంటనే సర్వే నిర్వహించి అర్హులైన ఒంటరి మహిళలు, వికలాంగులకు ఇండ్లు లేని నిరుపేదలకు గతంలో సర్టిఫికెట్ పొందిన వారికి డబల్ బెడ్ రూమ్ ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో గత 30 సంవత్సరాలకు పైగా అద్దెకు ఉంటూ ఆటో డ్రైవర్లు, బీడీ కార్మికులు, రోజు వారి కూలీలుగా పనిచేస్తు కిరాయి ఇళ్లల్లో ఉంటున్న పేదలకు డబల్ బెడ్ రూమ్‌లలో ఎంపిక జరగలేదన్నారు. ఇప్పటికే సొంత ఇల్లు ఉన్న వారి విషయంలో అనేక సార్లు కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇండ్లు లేని నిరుపేదలను ఎంపిక చేయాలని అనర్హుల పేర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ నాయకులు నర్సింలు పద్మ కవిత లక్ష్మి వెంకటేష్ మహేందర్ సంపత్ రాము నరహరి సుక్కయ్య మంజుల తదితరులు పాల్గొన్నారు.

దురద మందు త్రాగిన పాఠశాల విద్యార్థిని



నవతెలంగాణ-తూప్రాన్ : తూప్రాన్ మున్సిపాలిటీలోని పోతురాజు పల్లి వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న మల్లీశ్వరి అనే విద్యార్థిని దురదకు వాడే దురద మందును సేవించడం జరిగింది. వాష్ రూమ్‌కి వెళ్లి వచ్చిన మల్లీశ్వరిని ఏదో వాసన వస్తుందని ఉపాధ్యాయురాలు అడగ్గా హాస్టల్లో ఉండడం ఇష్టం లేకనే దురద మందు తాగినట్లుగా విద్యార్థిని మల్లీశ్వరి పాఠశాలలోని ఉపాధ్యాయురాలికి తెలిపారు. వెంటనే పరిస్థితిని గమనించిన ఉపాధ్యాయురాలు తోటి విద్యార్థులతో కలిసి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారం రోజుల క్రితమే పోతురాజు పల్లిలోని పాత రాజరాజేశ్వరి పాఠశాల భవనంలోని జ్యోతిరావు పూలే పాఠశాలలో మల్లీశ్వరి ఏడవ తరగతిలో చేరింది. హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టం లేక రెండు రోజుల క్రితమే విద్యార్థిని బాగా ఏడుస్తున్నదని తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడించడం జరిగింది. ఆ తర్వాత తల్లిదండ్రులు కూడా మా అమ్మాయికి మేము సర్ది చెప్పుకుంటామని ఉపాధ్యాయురాలుతో నచ్చజెప్పి, అమ్మాయిని పాఠశాలలోనే వదిలి వెళ్లారు. అయినా కూడా వినని ఆ విద్యార్థిని హాస్టల్లో ఉండను అని ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ప్రస్తుతానికి బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నదని పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు.

ఇటుకబట్టి కార్మికులతో వెట్టిచాకిరి

- తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు
- వారికి కనీస సౌకర్యాలు కల్పించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సిములు



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గల ఇటుక బట్టీల్లో కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్గ సభ్యులు ఎం.నర్సిములు ఆరోపించారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా శ్రమ దోపిడి చేస్తున్న బట్టీ యజమానులపై రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) బృందం శనివారం రోజున ఇటుక బట్టీల సందర్శన చేసింది. ఈ సందర్భంగా నర్సిములు మాటాడుతూ.. ఈ బట్టీల్లో కార్మికులతో ఓవర్ టైం పని చేయిస్తూ నెలకు రూ.12 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారన్నారు. దాంతో కుటుంబ పోషణ గడవక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీసీఎల్ అధికారులు ఇటుక బట్టీల సందర్శన జరిపి కార్మికుల బాధలు తెలుసుకొని వారికి న్యాయం చేయాలన్నారు. కర్ణాటక, నారాయణఖేడ్ నుంచి కూలీలను తీసుకువచ్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని మండిపడ్డారు. తాగడానికి మంచినీరు కూడా లేదని.. ముళ్ళ పొదల మధ్యనున్న బోరు నుంచి నానా అవస్థలు పడుతూ నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. చీకట్లో విష పురుగులు తిరుగుతుంటాయి కాబట్టి.. వారి ఇంటి వద్దకే మంచినీళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఉండడానికి బట్టీల దగ్గరనే ఇటుకలతో నిర్మించినట్టు చిన్నటి పాకలు ఉన్నాయని.. వాటిని పెద్దగా ఏర్పాటు చేసి ఇవ్వాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారుల నిర్లక్ష్యంతో చెరువులు, గుట్టల నుంచి ఇటుక బట్టీలకు మట్టి గుట్టలు గుట్టలుగా వెళ్తుందన్నారు. అధికారులు వెంటనే మేల్కొని అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఇటుక బట్టి యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటుక బట్టీలకు విద్యుత్ మీటర్లు ఉన్నాయా? లేవా? అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఈ సమస్యలన్నీ సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.రాజయ్య, నాయకులు కుమార్, మహేష్, సంజీవులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ధరణి దరఖాస్తులను యుద్ధ ప్రతిపాదికన పరిష్కరించాలి

రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్

నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్/హవేలిఘనపూర్

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 10వేల దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయని మండలాలవారీగా ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో ప్రత్యేకంగా సమీక్షిస్తూ పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిశీలించి ఆన్లైన్లో అప్లోడ్ చేసి రిపోర్ట్ పంపించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేయడంపై ప్రధానంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో 1 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు 20 ఎకరాల భూమిని గుర్తించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట మెదక్ జిల్లాల కలెక్టర్ లు ఎం.మను చౌదరి, రాహుల్‌రాజ్‌లతో పాటు సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు, సదానందం బన్సీలాల్ రామ్మూర్తి,, రమాదేవి, జయచంద్రారెడ్డి, జగదీశ్వర్ రెడ్డిలతో పాటు తహశీల్దార్‌లు, జిల్లా ధరణి కోఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.



చిట్కూల్ పెద్దచెరువు మత్స్యకారులను ఆదుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



పటాన్చెరువు మండలం చిట్కూల్ గ్రామ పరిధిలోని పెద్ద చెరువులో లక్షల చేపలు మృత్యువాత పడడం దారుణమని.. దానిపైన జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరపాలని, మత్స్యకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్కూల్ పెద్దచెరువులో లక్షల చేపలు చనిపోవడంతో దాని మీద ఆధారపడిన మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారన్నారు. చేపలను అమ్ముకునే దశలో చనిపోవడంతో మత్స్యకారుల బాధ చెప్పలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. పీసీబీ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలన తప్పా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పీసీబీ అధికారుల నిర్లక్ష్యంతో కాలుష్య కారక పరిశ్రమలు ఇష్టారాజ్యంగా రసాయనాలు వదలడంతోనే ఈ ఘోరం జరిగిందన్నారు. మత్స్యకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. ఈ ఘటన పై జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరిపించాలన్నారు. నిర్లక్ష్యం వహించిన పీసీబీ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్‌ఓసి చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్



నిజాంపేట్ మండలంలోని బల్కంచెల్కా తాండాకు చెందిన పాండ్యానాయక్‌కు మంజూరైన రూ.2,10,000 ఎల్‌ఓసీ చెక్కును నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి నప్పటికీ నియోజకవర్గ ప్రజల కోసం ఎల్లవేళలా వారికి అండగా ఉంటానన్నారు. ఓడిపోయిన తర్వాత కూడా దాదాపు 400 సీఎంఆర్ఎఫ్ అప్లికేషన్లు చేశానని.. అలాగే ఎల్‌ఓసి చెక్కును కూడా అందజేశానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, బాచేపల్లి ఎంపీటీసీ కిషన్ నాయక్, సిర్గాపూర్ మండల కోఆప్షన్ సభ్యులు బషీర్, పార్టీ మండల ఉపాధ్యక్షులు నర్సింలు, పట్టణ అధ్యక్షులు నగేష్ సేట్, మాజీ ఎంపీటీసీ ముజామిల్, నాయకులు గోపాల్, నాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డ్ జైపాల్‌కు ఉత్తమ సేవా పురస్కారం

నవతెలంగాణ-జహీరాబాద్



ప్రతిభ ఉన్నవారు ఎక్కడైనా రాణించగలుగుతారని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఇండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఉత్తమ సేవలు అందజేసిన హోంగార్డ్ జైపాల్‌ను పోలీస్ అధికారులు అభినందించారు. ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా బాడ్మింటన్ టోర్నమెంట్-2024లో జైపాల్ పాల్గొన్నారు. క్రీడల నిర్వహణ, మౌళిక వసతులు సమకూర్చడం, పోలీస్ అధికారులకు సేవలు అందించినందుకు గాను, ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆయన ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక కాగా.. ఎస్పీ రూపేష్, డీఎస్పీ రాం మోహన్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు శనివారం స్థానిక సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ రాం మోహన్ రెడ్డి అభినంధించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

పారా లీగల్స్ ను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలి

నవతెలంగాణ-హత్నూర

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ద్వారా 2006లో నియామకమైన పారా లీగల్స్‌ను రెవెన్యూశాఖలో విలీనం చేయాలని జిల్లాలోని ఆయా మండలాల పారా లీగల్స్ శుక్రవారం హైదరాబాద్లోని ధరణి కమిటీ సభ్యులైన భూమి సునీల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పారా లీగల్స్ జిల్లా అధ్య క్షుడు నాగేష్ మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ధరణి వ్యవస్థల్లో తమను కూడా తీసుకొని, తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మొదట్లో రెవెన్యూ సేవలు అందించిన తమకు భూరికార్డుల నమోదు, భూసమస్యల పరిష్కారంపై సంపూర్ణ అవగాహన ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ అనంత రాములు, శివయ్య, నిర్మల, రమేష్, పుండలిక్, పరమేశ్వర్ రాజయ్య, సుధాకర్, మల్లేషం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తాం



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రజల మధ్య ఉండి పార్టీ సంక్షేమానికి కృషి చేస్తున్న వారికి ఎల్లవేళలా అందు బాటులో ఉండి.. సేవలు అందిస్తామని టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఫ్రెండ్స్ కల్యాణ మండపంలో జరిగిన మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ సోదరుడి కుమారుడి వలిమ విందుకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యూనోస్ , అబ్దుల్లా, మోతిరామ్, రాములు నేత, బిజీ సందీప్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-హత్నూర

అక్రమ కేసుల్లో ఈడి, ఐటి ద్వారా లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ ను అరెస్టు చేయడం సిగ్గుచేటు అని.. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని దౌల్తాబాద్ లోని బీఎస్ రెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ... ఢిల్లీలో ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ అనేక పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో పుంజుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ బుర్ర రాములు గౌడ్, డాక్టర్ సల్మాన్ రాజు, జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి రాజేశ్వర్, మహమ్మద్ వాజిద్, రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు హేమ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యమునా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎం.ఏ.కే ఫైసల్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ పుట్టిన రోజు వేడుకలను సంగారెడ్డిలో జర్నలిస్టు నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐబీలో జర్నలిస్టులు కేక్ కట్ చేయించి, పూలమాలలు వేసి శాలువాతో సన్మా నించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బందారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి విష్ణు, ఖలిక్ హుస్సేన్, మొహమ్మద్ మసూద్ ఖాన్,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సిద్ధిఖ్, జిల్లా నాయకులు సీనియర్ జర్నలిస్టులు ఆరిఫ్, శ్రీనివాస్, ఎం.ఎ.మతిన్, అన్వర్, పరంజ్యోతి, పాండు, డేవిడ్, శేఖర్, పవన్, సంతోష్, అమెర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు బీఆర్ఎస్ నాయకుల నివాళ్లు..

నవతెలంగాణ-జహీరాబాద్



తెలంగాణ ఉద్యమ పాలికేక, కవి, తెలంగాణ రాష్ట్ర మాజీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కీర్తిశేషులు వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ పాత్రను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాయ కులు మాట్లాడుతూ.. సాయిచంద్ అందరి మధ్యలో శారీరకంగా లేకున్నా.. ప్రతీఒ క్క ఉద్యమకారుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సాయి చంద్ మరణం బీఆర్ఎస్‌కు తీవ్ర లోటు అని అన్నారు. ఇటీవలే జరిగిన శాసన సభ పార్ల మెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సభల్లో సాయిచందు గొంతు లేని లోటు కనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయ కులు నామ రవి కిరణ్, బండి మోహన్, మహమ్మద్ యాకూబ్, ప్రభు యాదవ్, తులసి దాస్ గుప్తా, శివప్ప, శ్రీకాంత్ నేత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ..



నవతెలంగాణ-మునిపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న రైతు భరోసా పథకంపై మండలంలోని పెద్దచెల్మెడ సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని రైతు వేదికలో శనివారం రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహకార బ్యాంకు జిల్లా అధికారి తుమ్మ ప్రసాద్ పాల్గొని.. రైతుల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు చెప్పిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అస్టెంట్ కవిత, జూనియర్ అసిస్టెంట్ రాథోడ్ సందీప్, ఏవో శివకుమార్, సొసైటీ చైర్మెన్ పద్మ దుర్గయ్య, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు అమలు కోసం ప్రత్యేక మహాజన సభ

నవతెలంగాణ-జోగిపేట

రైతుబంధు అమలు కోసం సహకార సంఘాల సభ్యుల అభిప్రాయ సేకరణకు జూలై 1వ తేదీన సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సభ సమావేశం నిర్వహిస్తున్నట్టు అందోల్ పీఎస్ఎసీ ఈఓ నర్సింలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్ చైర్మెన్ ఎస్.జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు అందోల్ పీఏసీఎస్ సంఘ కార్యాలయంలో ప్రత్యేక మహాజన సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ హాజరవుతారన్నారు. సంఘం డైరెక్టర్లు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని రైతుబంధు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి వచ్చిన రైతుల అభిప్రాయాలు, సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు.

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పరేడ్

- జిల్లా పోలీసులకు ప్రతీ శనివారం పరేడ్
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి



క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని.. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతీ శనివారం జిల్లా పోలీసులకు వీక్లీ పరేడ్ నిర్వహిస్తున్నట్టు ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఎస్పీ ఆదేశానుసారం ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ నరేందర్ ఆద్వర్యంలో రాజశేఖర్ రెడ్డి, రామ రావ్, హన్మి రెడ్డి ఆర్ఐలు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులకు, ట్రాఫిక్ సిబ్బందికి, హోంగార్డ్ సిబ్బందితో వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు, రోజువారీ విధుల్లో భాగంగా మెళకువలు నేర్చుకోవడం, డ్రిల్ ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు. ప్రతీరోజు వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరమని సిబ్బంది, అధికారులు ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. శారీరకంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నప్పుడే తమ విధులు సక్రమంగా నిర్వహించగలమని, ప్రతీ ఒక్కరికి ఫిజికల్ ఫిట్నెస్ తప్పనిసరి అన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ పరేడ్‌లో అధికారులకు విన్నవించుకోవడానికి వీలుంటుందని, పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంభించాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి, జిల్లాకు, తెలంగాణ పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

ఉద్యోగికి 'ఉద్యోగ విరమణ' సహజం



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రతీ ఉద్యోగి జీవితంలో ఏదో ఒకరోజు 'ఉద్యోగ విరమణ' సహజమని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఆర్ఎస్ఐ బి.హన్మంత్‌రెడ్డికి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1982లో పోలీసు శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా నియామకమై.. గడిచిన 42 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్, వివిధ రకాల అపరేషన్స్ నిర్వహించినట్టు చెప్పారు. తనకు ఇచ్చిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందారని, వారందించిన సేవలకు గాను సేవా పతకం, కాష్ రివార్డ్స్ కూడా అందుకున్నట్టు చెప్పారు. సర్వీస్ మొత్తంలో ఎలాంటి చిన్న రిమార్క్ లేకుండా అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ.. ఆర్మ్డ్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారన్నారు. ఆయన పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్ని రకాల బెన్ఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామన్నారు. మిగిలిన శేష జీవితం కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖ తరపున ఎల్లవేళలా సహాయ, సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్స్ అశోక్, వెంకటేశం, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, రామరావ్ హన్మిరెడ్డి, ఆర్ఎస్ఐ బి. హన్మంత్ రెడ్డి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పుల్కల్



డీసీసీబీ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ రాజ నర్సింలు అన్నారు. మండల పరిధిలోని పెద్దరెడ్డిపేట గ్రామంలో శనివారం 'ఇంటింటికీ బ్యాంకు సేవలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. పదేండ్లలోపు బాల బాలికలకు మరియు సిటిజన్లకు డిపాజిట్లపై అద్భుతమైన సేవలను తమ బ్యాంకు అందిస్తున్నదన్నారు. డిపాజిట్‌లపై 8.25 శాతం వడ్డీని అందిస్తున్నదన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పిల్లల భవిష్యత్‌కు బచ్‌పన్ భరోసా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వారిపై చేసిన డిపాజిట్ డబ్బులకు తొమ్మిదిఏండ్లలో రెట్టింపు ఇస్తామన్నారు. అంతేకాకుండా అర్హులైన వారికి నూతనంగా నిర్మించే గృహల కోసం లోన్‌లు, ఎడ్యుకేషన్ లోన్లు, రైతు నేస్తం, ల్యాండ్ డెవలప్మెంట్, షాప్‌లోన్ లాంటి అనేక సేవలను కల్పిస్తున్నదన్నారు. లాకర్‌ల సదుపాయం కల్పిస్తూ వినియోగదారులకు అత్యవసర సేవల్లో యూపీడీ. గూగుల్ ఫ్లే, ఫోన్ పే, పే టీఎం లాంటి సదుపాయాలు కూడా కల్పిస్తున్నామన్నారు. కాబట్టి వినియోగదారులు తమ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, పెద్దరెడ్డిపేట గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నాగు చౌహాన్‌ను సన్మానించిన ఉజ్వల్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

ఎస్టీ సెల్ జిల్లా కాంగ్రెస్ వైస్ చైర్మెన్ నాగు చౌహాన్‌ను పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి పట్టణంలోని ఆయన నివాసంలో పులమాల శాలవాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజన జాతికోసం పాటుపడాలని.. ఎల్లప్పుడు వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల్లో పేద గిరిజనులను గుర్తించి లబ్ది పొందేలా కష్టపడాలన్నారు. ఇటీవల ఒక పార్టీ గిరిజనులకు రెచ్చగొట్టి లబ్దిపొందడనికి పెద్దఎత్తున ప్రయ త్నాలు సాగించిందని, ఎన్నికలప్పుడే ఆ పార్టీకి గిరిజనులు గుర్తుకు వస్తారన్నారు. ఎన్నికలు అయిపోగానే గిరిజనులకు పట్టించుకోరని... అలాంటి పార్టీల వలలో పడొద్దని గరిజ నులకు స సూచించారు. గిరిజనుల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.నర్సింహరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రాజశేఖర్, మోతీరం రాథోడ్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు అక్బర్ హుస్సేన్, అక్షయ్ జాడే కోహిర్, నిలుచవాన్, పుర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్‌ఏంకు ఘన సన్మానం

నవతెలంగాణ-జహీరాబాద్



అసద్‌గంజ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాడు జగదీశ్వరయ్య బదిలీపై వెళ్తుండడంతో.. గ్రామస్తులు, పాఠశాల సహచార ఉపాధ్యాయులు శనివారం సమావేశం ఏర్పాటు చేసి పూలమాల, శాలువాకప్పి మోమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ పాఠశాలలో దశాబ్దానికి పైగా సేవలందించిన ఆయన.. ఇటీవలే ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా జహీరాబాద్ మండలంలోని రాంజోల్ ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేరేలా ఎప్పటికప్పుడు గ్రామస్తులతో సమావేశం నిర్వహించే వారన్నారు. ఆయన పాఠశాలలో చేరినప్పుడు 35 మంది విద్యార్థులు ఉండగా.. అనంతరం 120 మంది కిపైగా విద్యార్థుల సంఖ్యను పెంచాడన్నారు. అనంతరం జగదీశ్వరయ్య మాట్లాడుతూ..విధి నిర్వహణలో సహకరించిన గ్రామస్తులకు, విద్యార్థులకు, సహచర ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా అసద్‌గంజ్ గ్రామ పాఠశాల పేరును నిలబెట్టే విధంగా కృషి చేయాలని, దాని కోసం తన సలహాలు, సూచనలు నిరంతరం అందిస్తానన్నారు. కాగా ఆయన 2021/22 విద్యా సంవత్సరంలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2022/23లో ఉత్తమ జిల్లా ఉపాధ్యాయుడు, 2023/24లో ఉత్తమ రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు సాధించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎల్గోయి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్, ఉపాధ్యాయులు జీవన్‌రావు, నాగన్ వరాలు, ఫర్విన్ ఫాతిమా, ఆసియా ఫర్విన్, నర్సింహారెడ్డి, విజయ్ కుమార్, సిబ్బంది జనిమియా తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



ప్రజా శ్రేయస్సు కోసం నిత్యం ప్రజల్లో ఉంటూ సేవ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ షేట్కర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో శనివారం విలేకరుల సమావేశంలో చైర్మన్ ఆనంద్ స్వరూప్ షేట్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల కోసం నిత్యం అహర్నిశలు కష్టపడుతూ ప్రజా శ్రేయస్సు కోసం నిత్యం పోరాడుతున్న వ్యక్తి ఎమ్మెల్యే సంజీవరెడ్డి అని అన్నారు. అనవసరంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి పైన అసత్య ఆరోపణ చేస్తే మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఓటమిని జీర్ణించుకోలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నట్టు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవ లాల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద, ముంతాజ్, సంగ్రామ్ జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అదనపు కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు, పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ని కలిసి చర్చించారు. సైంటిఫిక్ సోలిడ్‌వెస్ట్ మేనేజ్మెంట్ పార్క్‌పై ప్రధానంగా చర్చించారు. సైంటిఫిక్ సోలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ పార్క్ పూర్తి కావడానికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారు. ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ యార్డ్ నిర్మాణ పనుల త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు వినియో గంలోకి తీసుకురావాలన్నారు. సదాశివపేటలో డంపింగ్ యార్డ్ కోసం స్థలం కేటాయించాలన్నారు. తారా డిగ్రీ కాలేజ్, గవర్నమెంట్ హాస్పిటల్, సితార థియేటర్ వద్ద శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించి నూతన వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌవన్, డిఈ. ఇంతియాజ్ అహ్మద్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ కేవీకేకు రాష్ట్రస్థాయిలో అవార్డులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ కేవీకేకు రాష్ట్రస్థాయిలో అవార్డు లభించినట్టు కేవీకే ఇన్చార్జి డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. ఆటారిజోన్-10 ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచేరి) వార్షిక జోనల్ సమావేశాలను ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో గల భారతీయ పొగాకు పరిశోధనా స్థలంలో జూన్25-27 వరకు నిర్వహి ంచిన విషయం విధితమే. అందులో భాగంగా నాలుగు రాష్టాలకు చెందిన 72 కేవీకేల ప్రతినిధులు మరియు పలు పరిశోధన సంస్థల డైరెక్టర్స్ పాల్గొన్నారు. గతేడాది-2023లో నిర్వహించిన కార్యక్రమాలను బట్టి పలు కేవీకేలకు కొన్ని అవార్డ్స్ అందజేశారు. అందులో భాగంగా జహీరాబాద్ డీడీఎస్ కేవీకేకి 2518 భూసారా పరీక్షలు చేసి.. రైతులకు భూసారా కార్డులు ఇచ్చి సమగ్ర ఎరువుల నిర్వహణ చేసినందుకు గాను బహుమతి అందజేశారు. భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం డైరెక్టర్, డాక్టర్ ఆర్ కె.మాథోర్, ఆటారి డైరెక్టర్ జోన్ -10 డైరెక్టర్. డాక్టర్ ఎస్ఎన్.మీరా చేతుల మీదుగా డీడీఎస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సి.వరప్రసాద్ మరియు డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వెలుగిరి ఆ బహుమతిని అందుకున్నారు. అంతేకాకుండా వికిషిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణ మరియు వార్షిక పనుల నివేదిక సకాలంలో చేసినందుకు గాను ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

యథేచ్ఛగా అక్రమ కట్టడాలు!

- నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం..

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని మాందాపూర్ గ్రామ శివారులో గల సర్వే నంబర్ 101,102, 103 ,104 ,105 ,125,126, 127,128,129 లో ఉన్న రిదీర వెంచర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గేటెడ్ పర్మిషన్ లేకుండా చుట్టూ పెన్సింగ్ వేసి, గేట్లు పెట్టడంతో పక్కన ఉన్న రైతులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతున్నదన్నారు. కనీసం పంచాయతీ అధికారుల అనుమతి కూడా లేకుండా నిర్మాణాలు సాగిస్తున్నారని మండిపడుతున్నారు. బహుళ అంతస్తులు నిర్మించొద్దని ప్రభుత్వం నుంచి నోటీసులు పంపినప్పటికీ.. వెంచర్ నిర్వాహకులు మాత్రం అంతా షరామాములే అన్నట్టుగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. అక్రమ నిర్మాణాల సమస్యను జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా, కేవలం పేరుకే నోటీసులు పంపిస్తున్నారని.. ఆ నోటీసుల వల్ల ఆ బడా బాబులకు ఒరిగేదేమీ లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ విషయమై స్థానిక విలేజ్ సెక్రెటరీ వివరణ కోరగా.. ఆ వెంచర్‌కి డీటీసీపీ పర్మిషన్ తప్పా, నిర్మాణాలకు,పెన్సింగ్ గేట్లు వేయడానికి పర్మిషన్ లేదన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టొద్దని నోటీసులు ఇవ్వడం పై ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. అయినా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. చేపట్టిన నిర్మాణాలని కూల్చివేసి.. పెన్సింగ్‌ను తీసేవేయాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-ఝరాసంగం

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో గల ధాన్యం సేకరణ గోదాంలో శనివారం రైతు భరోసా పథకంపై సొసైటీ చైర్మెన్ గౌసోదిన్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. డీసీసీబీ జిల్లా అధికారులు ఓఎస్‌డీ శ్రీధర్, సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఆడిటర్ నిర్మల ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకంలో భాగంగా ఎలాంటి రైతులకు ఈ పథకం వర్తింప చేస్తే బాగుంటుంది? అనే అంశంపై సొసైటీ సభ్యులు.. 22 మంది రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 10 ఎకరాల వరకు పంటలు సాగు చేసే వారికి మాత్రమే ఇవ్వాలని కొందరు అనగా.. మరికొందరు 5 ఎకరాల వరకే సాగు చేసే వారికి ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ రిటర్న్లు కట్టే వారికి, నాన్ అగ్రికల్చర్ భూమి ఉన్నవారికి రైతుబంధు ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవదాస్, ఏవో వెంకటేష్, సీఈఓలు నిస్సార్, శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్, నాయకులు శంకర్ పాటిల్, నరేష్, గుండప్ప, హఫీజ్, మారుతి రావు, తదితరులు పాల్గొన్నారు.

50 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్‌లో 50 పడకల ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమం ఆగదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్ అన్నారు. శనివారం నిర్వహించిన మహీంద్రా అండ్ మహేంద్ర ట్రాక్టర్స్ యూనియన్ల సమావేశాల్లో ఈ ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతం రోజు రోజుకూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నదని.. ప్రత్యేకించి పరిశ్రమలు, కార్మిక వర్గం పెరుగుతున్నదన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా కనీసం 50పడల ఈఎస్ఐ హాస్పిటల్ అవసరమన్నారు. జహీరాబా ద్ ప్రాంతంలో సుమారుగా మూడు వేల మంది ఈఎస్ఐ కార్డు హెూల్డర్స్ ఉన్నారని.. వారి దగ్గరి నుంచి సుమారుగా రూ.23 నుంచి 25లక్షలు ఈఎస్ఐ బోర్డుకు వెళుతున్నాయన్నారు. అయినప్పటికీ ఇక్కడున్న ఈఎస్ఐ, డిస్పెన్సరీలో కనీస సౌకర్యాలు లేవన్నారు. అందుకే 50పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ ఏర్పాటుకు దశల వారీగా అందోళ చేస్తామన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి ఈ హస్పిటల్ ఏర్పాటు చేసే వరకూ జరిగే పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటామన్నారు. ఈ సమావేశాల్లో ఆయా యూనియన్ల నాయకులు గణేష్, నరేష్, బాల్ రాజ్, వంశి క్రిష్ణ, ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ-రాయికోడ్



హైదరాబాద్‌లోని టీసీఎస్ ఐటి కంపెనీలో పనిచేస్తున్న జైపాల్, సురేష్, జూన్‌పాల్, సతీష్ మిత్రబృందం ఆధ్వర్యంలో మండల పరిధిలోని సంగీతం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం స్కూల్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తాము ఈరోజు ఉన్నత శిఖరాలకు ఎదిగామన్నారు. విద్యాంస్థలు ఖాళీ కుండ లాంటివారని.. మంచిని ఆస్వాదించి చెడును వదిలే యాలన్నారు.కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యత గల ఉపాధ్యాయులు ఉత్తమమైన బోధన ఇస్తారన్నారు. ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు గోపాల్ పరిచయం ద్వారా ఈ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మానయ్య, గోపాల్, రఘునాథ్‌రెడ్డి, శివకుమార్, నర్సింలు, యాదయ్య, అన్నపూర్ణ, ప్రవీణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నవతెలంగాణ-వెల్దుర్తి



మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పోలీస్ స్టేషన్ తూప్రాన్ నూతన సిఐ రంగకృష్ణ శనివారం సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు ఎస్సై నవత గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఆయన పరిశీలించారు. పలు సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు అనునిత్యం వచ్చే ప్రజానీకానికి సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. మండలంలో ఏవైనా అసంఘటిత రంగ కార్యకలాపాలు జరిగితే పోలీస్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గత కొంతకాలంగా వెల్దుర్తి మండల పోలీస్ స్టేషన్లో హెూంగార్డుగా లక్ష్మీ నరసమ్మ విధులు నిర్వహిస్తుండగా అనారోగ్య రీత్యా ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించిన సమాచారం తెలుసుకున్న తూప్రాన్ సీఐ.రంగాకృష్ణ వెల్దుర్తి, ఎస్ఐ.నవత గౌడ్‌తో కలిసి శనివారం హెూంగార్డ్ లక్ష్మి నరసమ్మ కుటుంబాన్ని ఓదార్చి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుఫాన్ సీఐ.రంగా కృష్ణ మాట్లాడారు, చనిపోయిన హెూంగార్డు లక్ష్మీనరసమ్మ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు.

హన్మంతరావును కలిసిన నార్సింగి నాయకులు

నవతెలంగాణ-నార్సింగి



మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు మైనంపల్లి హన్మంతరావు రామాయంపేట మండలం లక్ష్మాపూర్ వెళ్లి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారి 44 పై వెళ్తున్న సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ హన్మంతరావుకు మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొని రాగా సానుకూలంగా స్పందించారు. మండలాభివృదికి తాను కట్టుబడి ఉన్నానని, అభివృద్ధి పనులకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీనిచ్చారు. అందుకు నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, ఎంపీటీసీ సత్యనారాయణ, అంచనూరి రాజేష్, మాజీ ఎంపీపీ బోయిని ప్రభాకర్, చందూ యాదవ్, శంకర్‌లు హన్మంతరావును కలిశారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే

ఎమ్మెల్సీ కూర రగోత్తం రెడ్డి

నవతెలంగాణ-నర్సాపూర్



ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజమేనని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కుందుర్తి శ్రీనివాస్ పదవి విరమణ పొందిన సందర్భంగా పాఠశాల ఆవరణలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై ప్రసంగించారు ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో విధులు నిర్వహిస్తే మంచి పేరు సంపాదించుకుంటారన్నారు. అచ్చంపేట పాఠశాలలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉద్యోగరీత్యా పాఠశాలకు మంచి సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన సేవలను విద్యార్థులు ఎప్పటికీ మరువలేరన్నారు. అంతేగాక పిఆర్‌టియు టీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగానే ఉద్యోగస్తులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం పిఆర్‌టియు సంఘ సభ్యులు విద్యార్థులు గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఎంఈఓ బుచ్చా నాయక్, పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, ఎంపీ ఓ వైద్యం శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు స్వరూప రాణి, ఉపాధ్యాయులు ధన్ సింగ్, తారా సింగ్, చెన్నా నాయక్, సత్యనారాయణ, రమేష్ నాయక్, లాలూ నాయక్, శ్రీనివాస్ జాదవ్, గ్రామస్తులు శ్రీనివాస్, నిరుడు బిక్షపతి, గోవర్ధన్, సాయిలు, కమ్మరి షణ్ముఖ చారి, కళాకారుడు ఆంజనేయులు, విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ ప్రజలకు అందుబాటులో ఉండాలి.

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట



108 సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవాలాందించాలి ని, జిల్లా 108 అంబులెన్స్ పోగ్రామ్ అధికారులు జనార్దన్, మహేష్ తెలిపారు. శనివారం పెద్ద శంకరాంపేటలో అధికారులు అంబులెన్స్ రికార్డులను తనఖీ చేసి మాట్లాడారు. అంబులెన్స్ సిబ్బంది పరిసర మండలాల ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు, ఏ క్షణం ఫోన్ వచ్చిన వెంటనే స్పందించలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఏంటి కుమార్, రమేష్, పైలెట్ బుమయ్య, ఉన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధి మన్నె వారి జలాల్పూర్ గ్రామానికి చెందిన జాల బాలరాజు అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతి లేకుండా శనివారం అక్రమంగా ట్రాక్టర్ ద్వారా ఇసుక తరలిస్తున్నారు, అన్న నమ్మదగిన సమాచారం మేరకు వెల్దుర్తి ఎస్సై నవత గౌడ్, ఇసుక ట్రాక్టర్లు అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మైనింగ్‌కు సంబంధించిన ఇసుక మట్టి వంటి వాటిని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేసి సీజ్ చేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రానికి అతి ముఖ్యమైన నరసంపల్లి-సుతారి పల్లి, నార్సింగి-మిర్జాపల్లి, నార్సింగి-శాలీపేట్ లింకు రోడ్లు మండల అభివృద్ధికి ఎంతో అవసరమని నార్సింగి జెడ్పీటీసీ బాణాపురం క్రిష్టా రెడ్డి అన్నారు. మండల కేంద్రం నుంచి శాలీపేటకు నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్టా రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రమైన నార్సింగి అభివృద్ధి చెందాలంటే చుట్టూ పక్కల గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగించడానికి లింకు రోడ్లు అవసరమని గతంలో ఇప్పటి మెదక్ ఎమ్మెల్యే అప్పటి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టి తీసుకు వెళ్లానని, అందుకు సానుకూలంగా స్పందించిన కొత్త ప్రభాకర్ రెడ్డి నార్సింగి-శాలిపెట్ రోడ్డు నిర్మాణం కొరకు జెడ్పీ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేశారని, ఇప్పుడు కల్వర్టు, గ్రావెల్ నిర్మాణం కోసం మరో రూ.10 లక్షలు జెడ్పీ నిధుల నుంచి మొత్తం రూ.25 లక్షలు కేటాయించారని తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ హేమలత శేఖర్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి ఇక్కడి రైతులు సహకరించాలని, రోడ్డు నిర్మాణం జరిగితే రైతుల ఇబ్బందులు తొలగిపోతాయని, తద్వారా మండల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ రోడ్డును బైపాస్ రోడ్డుగా వాడుకుంటే అన్ని విధాలుగా మండల, పరిసర గ్రామాల ప్రజలకు అనువుగా ఉంటుందని, ఈ రోడ్డుకు మెటల్ రోడ్డుగా చేసుకునేందుకు, ఎమ్మెల్యేతో మాట్లాడదామని, అందుకు అందరి సహకారం కావాలన్నారు. ఎమ్మెల్యే తప్పకుండా ఇంకా నిధులు మంజూరు చేస్తారన్న నమ్మకాన్ని జెడ్పీటీసీ వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీతో పాటు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, వార్డు సభ్యులు జోగు జీవన్ కుమార్, గణేష్, రోమాల రాజు, పరిసర రైతులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-నిజాంపేట



కరీంనగర్, పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కేంద్ర హెూం సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి సారిగా బండి. సంజయ్ కుమార్‌ని ఢిల్లీలోని అధికార కార్యాలయంలో మెదక్ నియోజక వర్గం ఇన్చార్జి, జెడ్పీటీసీ పంజ.విజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మెదక్‌లో పరిస్థితులు, పార్టీ విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీని, పార్టీ జెండాని భుజాల మీద వేసుకుని పని చేయాలని అధికారంలోకి తీసుకురావాలని, మెదక్ ఎమ్మెల్యే కావాలని పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జె. శంకర్ గౌడ్, భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

వర్షం కురవడంతో రైతుల హర్షం

నవతెలంగాణ-నార్సింగి



వానా కాలం మొదలై నాలుగు వారాలవవుతున్నా చెప్పుకోదగ్గ వాన పడకుండా, వర్షాలు ముఖం చాటేసాయి. రైతులు పొలాలలో వరి తూకం వేసి నాట్లు వేయడానికి, వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూశారు. వానాకాలం పంట ఎలాగా అని దిగులు పడుతున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరుగా కురిసిన వర్షం మండల రైతులకు కాస్త ఊరటనిచ్చింది. వర్షం కురవడం వల్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నార్సింగి మండల పరిధిలో రైతులు ఎక్కువగా వరి వేస్తుండగా, కొందరు మక్కలు పండిస్తారు. వరికి నీళ్ల ఎక్కువ అవసరం ఉండడం, ప్రస్తుతానికి గ్రామ చెరువులలో నీరు ఎక్కువ నిలువ లేక పోవడం, బోర్లు కూడా నీరు సరిగ్గా పోయక పోవడంతో కలత చెందుతున్నారు. శనివారం పడిన వర్షం చాలినంతగా లేక పోయినా, ఇప్పటి నుంచి అయినా వర్షాలు బాగా కురుస్తాయని కర్షకులు ఆశాభావం తో ఉన్నారు. వర్షాలు బాగా కురవాలని, చెరువులు నిండి అలుగులు పారాలని అన్నదాతలు వరుణ దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు.

ఆలస్యంపై అనుమానాలు..?

- సాయికృష్ణ హాస్పిటల్ పై చర్యలెప్పుడు..!
- వారం రోజులన్నారు.18 రోజులైంది
- పైరవీలు చేస్తున్న ఆసుపత్రి యాజమాన్యం

నవతెలంగాణ-రామాయంపేట

ప్రసవానికి వచ్చిన గర్భిణీకి అధిక మోతాదు మందులివ్వడంతో పాటు, తీవ్ర రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న ఆమెను, నిర్లక్ష్యంగా హైదరాబాద్‌కు పంపడం వల్లే మృతి చెందిందని అధికారులు విచారణలో తేల్చి, వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు. విచారణ పూర్తి చేసి18 రోజులు గడిచిన ఇప్పటికీ ఆసుపత్రి పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గత నెల 18న రామయంపేట పట్టణానికి చెందిన ఎస్తేర్ (22) అనే మహిళ స్థానిక సాయి కృష్ణ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చి మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ విషయాన్ని నవ తెలంగాణ వెలుగులోకి తేగ, మే 20న డిప్యూటీ డిఎంహెచ్ఓ అనిలా నేతృత్వంలోని వైద్య బృందం విచారణ జరిపింది. విచారణ పూర్తయిన సాయికృష్ణ ఆసుపత్రి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహించిన మృతురాలు కుటుంబ సభ్యులు, మే 30న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గర్భిణి మృతి విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ నేతృత్వంలో సాయి కష్ణ ఆసుపత్రి పై విచారణకు ఆదేశించారు.

వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామన్న డిఎంహెచ్ఓ

జూన్ 11న జిల్లా వైద్యాధికారి నేతృత్వంలో ప్రత్యేక బృందం రామాయంపేట సాయి కృష్ణ ఆసుపత్రిలో విచారణ జరిపింది. విచారణ అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ విలేకరులతో మాట్లాడుతూ అధిక మోతాదు మందులు ఇవ్వడం వల్ల గర్భిణీకి తీవ్ర రక్తస్రావం అయిందని విచారణలో తేలిందన్నారు. అలాగే తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆమెను కనీస జాగ్రత్తలు లేకుండా హైదరాబాద్‌కు తరలించడం వల్ల ప్రాణ నష్టం వాటిల్లినట్టు తేల్చారు. పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతామని, ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయాన్ని నివేదికలో పొందుపరుస్తామన్నారు. వారం రోజుల్లో ఆసుపత్రి పై చర్యలుంటాయని తెలిపారు.

18 రోజులైనా చర్యలేవి

వారం రోజుల్లో సాయిక్రిష్ణ ఆసుపత్రి పై చర్యలు తీసుకుంటామన్న జిల్లా వైద్యాధికారులు 18 రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైరవీలు, రాజకీయ ఒత్తిళ్లతో పాటు ఇతర మార్గాలలో ఆసుపత్రి పై చర్యలు తీసుకోకుండా ఆపుతున్నారని, మృతురాలు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే, జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని మృతురాలు కుటుంబ సభ్యులు మంద యాదగిరి నవతెలంగాణతో తెలిపారు.



భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసేది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలే

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్


నవతెలంగాణ-మెదక్ టౌన్



జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా కళాశాల బ్రోచర్‌ని విడుదల చేసినట్టు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ప్రస్తుతం దోస్త్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయని, మెదక్ పరిసర ప్రాంత విద్యార్థులు వివిధ కోర్సులలో అడ్మిషన్లు పొందవచ్చునని ప్రిన్సిపల్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ మొదలైన కోర్సులలో ప్రవేశం పొందగలరని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కామర్స్ విభాగంలో బీబీఏ కోర్సును కూడా ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు తృతీయ సంవత్సరంలో ఇంటర్న్ షిప్ లభించడమే కాకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రిన్సిపల్ అన్నారు. బీఏ, బీకాం, బీఎస్సి కోర్సులు అన్నింటిలోనూ కంప్యూటర్ సైన్స్ కోర్స్‌తో పాటు మూక్స్ ద్వారా కొన్ని ఆన్ లైన్ కోర్సులు కూడా ఉన్నట్టు దీనిని విద్యార్థులు గమనించి ఎన్నుకోవాలని తెలిపారు. కళాశాలలో అర్హత, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, ఆధునిక వసతులు కలిగిన కంప్యూటర్ ల్యాబ్‌లు, వేలాది పుస్తకాలు కలిగిన లైబ్రరీ సౌకర్యం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జిమ్ ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులకు, నాణ్యమైన విద్యను అందించడంలో అంకితభావంతో పని చేయాలని సూచించారు. దీని ద్వారా నిరుపేద విద్యార్థులైన ఈ ప్రాంత విద్యార్థులకు మేలు కలుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్‌తో పాటు కళాశాల దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ దినకర్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ చంద్రశేఖర్, సురేందర్ రావు, మురళి, శ్రీనివాస్, శ్రీమతి అన్నపూర్ణ, సుధారాణి పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్టు కింద మట్టి నమూనాలు

నవతెలంగాణ-నార్సింగి



రైతులకు పంట దిగుబడులు భూమి సారాన్ని బట్టి వస్తుంటాయి. కానీ భూమిలో ఎంత సారం ఉందో తెలియక రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడి, అనవసరంగా వారికి పెట్టుబడులు పెరిగి క్రమేణా భూసారం కూడా తగ్గిపోతుంది. రైతుల కష్టం, భూసారం వృథా కాకుండా నేల స్వభావం పై రైతులలో అవగాహన కలిగి దానికి తగినట్టుగా ఎరువుల ఖర్చులు తగ్గించుకుంటూ, ఆ నేలకు అనువైన పంటలు పండిస్తే రైతులకు లాభాలతో పాటు భూసారాన్ని కాపడగలమని భావించిన కేంద్ర ప్రభుత్వం భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాకు ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసారు. 2024-25 సం. మెదక్ జిల్లాలో నార్సింగి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద గుర్తించారని, నార్సింగి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణ తెలిపారు. విజృంభణ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో చాలా మండలాల్లో ముందుగానే సాగు ప్రారంభం అవ్వగా, రామాయంపేట ఏడీఏ పరిధిలోని నార్సింగి మండలంలో కొద్ది ఆలస్యంగా నాట్లు, ఇతర పంటలు వేయనున్నారు, అందువల్ల నార్సింగిలోనే ప్రాజెక్టును మొదలు పెట్టాలని అధికారులు భావించారన్నారు. మండల వ్యాప్తంగా 12356 ఎకరాల భూమి ఉండగా 5439 మంది రైతులకు చెందిన 8035 ఎకరాల భూమిలో సాగు చేస్తున్నారని తెలిపారు. నేల స్వభావాన్ని తెలుపుతూ 5105 ఎకరాలు చల్క, 1680 ఎకరాలు నల్ల రేగడి, 1250 ఎకరాలు ఎర్ర నేలలు ఉన్నాయన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలం నుంచి 1607 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యాన్ని పెట్టారని పేర్కొన్నారు. గతంలో 25 ఎకరాలకు ఒక మట్టి నమూనాను సేకరించే వారని, ప్రస్తుతం రెండున్నర ఎకరా (హెక్టార్)కు ఒక నమూనా సేకరించ నున్నారన్నారు. ప్రతి వ్యవసాయ క్లస్టర్లో ఒక ఆదర్శ రైతును ఎంచుకుని రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రదర్శన క్షేత్రం నిర్వహించి, జులై 10 లోపు మట్టి నమూనాల సేకరణ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. నమూనాల వివరాలను "సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్ మొబైల్ యాప్"లో నమోదు చేసి, జులై 31 వరకూ నమూనాలను పరీక్షా కేంద్రాలలో విశ్లేషణ జరిపి, ఆగస్టు రెండో వారంలో వాటి ఫలితాలను "ఆరోగ్య కార్డు" రూపంలో రైతులకు అందజేయ నున్నారని చెప్పారు. ముందుగా వానాకాలంలో 40 శాతం మేర పరీక్షలు పూర్తి చేసి మిగతా పరీక్షలు ఏడాది కాలంలో పూర్తి చేస్తామన్నారు. భూసార పరీక్షా ఫలితాల ద్వారా రైతులకు వారి నేలలో ఎలాంటి పంటలను వేయాలి, ఎంత ఎరువులను వాడాలి అనే విషయాల పై పూర్తి సమాచారం తెలుస్తుందని, దాంతో రైతులకు భూమిలో సారం పెరగడం, పంట దిగుబడులు పెరగడంతో పాటు ఎరువుల ఖర్చులు కూడా తగ్గిపోయి లాభాలు చేకూరుతాయని తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండల పరిధిలోని శేరిపల్లి, వల్లూరులలో మట్టి నమూనాలు సేకరించగా, భీమ్రావు పల్లిలో నమూనాల సేకరణ శనివారంతో పూర్తి అయ్యిందన్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా మట్టి నమూనాల సేకరణ చేస్తామని నార్సింగి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని విజృంభణ తెలిపారు.

నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తా

ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవ తెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాల్ చైర్మన్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ నర్సాపూర్ పట్టణంలో నూతనంగా గురుకుల పాఠశాల ఏర్పాటుకు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి కేటాయించుటకు, మున్సిపాల్ కు గతంలో కేటాయించిన టి యు ఎఫ్ ఐ డి సి నిధులు, ఎస్డిఎఫ్ వీధుల విడుదల కొరకు ఎమ్మెల్యే సునీత రెడ్డికీ విన్నవించగా అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతా రెడ్డిని మున్సిపాల్ చైర్మన్ అశోక్ గౌడ్ సన్మానించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎండి నహీముద్దీన్, కౌన్సిలర్లు రామ్ చందర్ , సరిత ఆంజనేయులు, లక్ష్మీ నాగేష్, యాదగిరి, బుచ్చేష్ యాదవ్, లతా రమేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జై రామ్ నాయక్, మేనేజర్ మధుసూదన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్ : ప్రమాదవసత్తు మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. హవేలీ ఘనాపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన కోరంకల రాజు 26 మృతి చెందాడు.హవేళి ఘనాపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్ వివరాల ప్రకారం కోరంకుల రాజు మానసికంగా ఆరోగ్యంగా లేకపోవడంతో ఇంటి నుంచి బుధవారం బయలుదేరి వెళ్లిపోయాడు. హవేలీ ఘనపూర్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు అయిందని తెలిపారు. కుటుంబ సభ్యులు రాజు ఆచూకీ కోసం బంధువుల వద్దకు ఇతర ప్రాంతాల వద్ద వెతికినా దొరకలేదు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన బావిలో పడి శవమై కనిపించాడని, పోలీసులకు సమాచారం అందించగానే చేరుకొని సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించిన అనంతరం మెదక్ జిల్లా ఆసుపత్రికి శవాన్ని తరలించినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. మృతుని తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌతెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ విరాళం

నవ తెలంగాణ నర్సాపూర్ : శివంపేట మండల పరిధిలోని పంబండ గ్రామంలో నూతనంగా నిర్వహిస్తున్న అంబేద్కర్ విగ్రహానికిగాను జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా రూ. 25 వేలవిరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామస్తులు రాజశేఖర్ గౌడ్, యాదగిరి కృష్ణ, సత్తయ్య , మానయ్యలు పాల్గొన్నారు.

గణాంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- పీసీ మహాలనా బీస్ జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



ప్రతి ఒక్కరు ఘనంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పీసీ మహలన బీస్ జయంతి వేడుకలు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయల సముదాయంలో జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతీయ గణాంక దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు ప్రసంగిస్తూ గణాంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని. జీఎస్‌డీపీని కూడా మండల, డివిజనల్ స్థాయిలో అదే విధంగా జిల్లా స్థాయిలో కూడా చేయాలని, ఈ సందర్భంగా మండల ప్లానింగ్ అధికారులను ఉద్దేశించి చెప్పారు. ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి బి. మాన్య నాయక్ ప్రసంగిస్తూ మండల ప్లానింగ్ అధికారులు, డివిజనల్ లెవెల్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఒక క్రమ పద్ధతిలో పనిచేసి గణాంకాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా పని చేయాలని నివేదికలు నిర్దేశిత గడువు లోపల సమర్పించే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గణాంక అధికారి మాకం బద్రీనాథ్, ఉపగణాంకాధికారి సిహెచ్ సురేష్ సహాయ గణాంకాధికారి, జి.సురేష్ మండల ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా పథకంపై హామీ ఇవ్వాలి

నవతెలంగాణ-పాపన్నపేట







భూ పరిమితి విధించ కుండా రైతు అందరికీ రైతు భరోసా ఇవ్వాలని అన్నదాతలు డిమాండ్ చేశారు, శనివారం ప్రభుత్వం ఆదేశానుసారము పాపన్నపేట మండలం చీకోడులో రైతు భరోసా పథకముపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు, సొసైటీ చైర్మన్ దత్త రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం సాగు చేసే రైతులందరికీ పరిమితి లేకుండా పథకం వర్తింప చేయాలని కోరారు. కౌలు రైతులకు భరోసా పథకం ఇవ్వాలన్నారు. పెట్టుబడి సాయం సకాలంలో రైతుకు అందేలా చూడాలన్నారు. కాగా మరి కొంత మంది రైతులు కేవలం 5 ఎకరాల వరకే పరిమితం చేయాలన్నారు, సమగ్ర సర్వే చేయించి వ్యవసాయేతర భూముల ను తొలగించి కేవలం సాగు భూములకు మాత్రమే ఇవ్వాలన్నారు.10 ఎకరాల వరకు పరిమితి విధించి పెట్టుబడి సాయం రైతు భరోసా కింద అందించాలని కొంత మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ అభిప్రాయ వివరాలని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని, డీఏఓ తెలిపారు. కార్యక్రమం లో సహకార శాఖ అల్లాదుర్గ్ క్లస్టర్ ఇంచార్జ్, సహకార సంఘం అసి స్టెంట్ రిజిస్టర్ ఫైజుద్దీన్, మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ప్రశాంత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని రంగంపేట సహకారసంఘం ఆవరణలో రైతు బరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ సహకార సంఘం చైర్మన్ అరిగె రమేష్ కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి సహకార శాఖ జిల్లా ఆడిటర్ కరుణాకర్, మండల వ్యవసాయాధికారి స్వేతాకుమారిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల రైతులు మాట్లాడుతూ సాగుచేసే రైతులకే రైతు బరోసా ఇవ్వాలన్నారు. అలాగే వ్యవసాయేతర భూములకు, ఫోర్జరీ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములకు రైతు బరోసా ఇవ్వొద్దని చెప్పారు. ఈ సమావేశంలో సీఈఓ నవీన్, ఏఈవో నిరోష రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం యొక్క చైర్మన్ అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు, రైతులతో స్థానిక రైతు వేదిక నందు ఈ వానాకాలం పంటలకు ఇవ్వబోయే రైతు భరోసా కార్యక్రమం పై శనివారం అభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగినది. ఇందులో వివిధ గ్రామాల రైతులు వారి యొక్క వ్యక్తిగత అభిప్రాయాలను తెల్పినారు. రైతులు తెలిపినటువంటి అభిప్రాయాలను అన్నింటిని సహకార పరపతి సంఘం వారు జిల్లా వ్యవసాయ కార్యాలయం, జిల్లా కోపరేటివ్ కార్యాలయమునకు పంపించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు సహకార పరపతి సంఘం అసిస్టెంట్ రిజిస్టార్ వ్యవసాయ మండల వ్యవసాయ అధికారి యాదగిరి వ్యవసాయ విస్తరణ అధికారి సుభాష్ సొసైటీ సీఈవో రవీందర్ సొసైటీ చైర్మన్ సంజీవరెడ్డి, ఇతర రైతులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్

పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.300లను, రూ.3000లకు పెంచాలని డిమాండ్ చేస్తూ జులై 3న రాష్ట్ర వ్యాపితంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా అధ్యక్షులు యశోద, జిల్లా గౌరవ అధ్యక్షులు బస్వరాజు, జిల్లా ఉపాధ్యక్షులు గౌతమ్‌లు విలేకరులతో మాట్లాడారు. వికలాంగుల పెన్షన్ 6000లకు, వృద్దులు, వితంతువుల పెన్షన్ 4000లకు వెంటనే పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని ఇచ్చిన హామిలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. నిత్యావసర సరకుల ధరలు గడిచిన 13 ఏండ్ల కాలంలో 300 రేట్లు పెరిగాయని, ధరల పెరుగుదల సూచికి అనుగుణంగా పెన్షన్స్ ఎందుకు పెంచడం లేదని వారు ప్రశ్నించారు. పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా పెంచకుండా వికలాంగుల గురించి మాట్లాడే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కడిదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణం, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, 2016 ఆర్‌పీడబ్ల్యూడి చట్టం అమలు వంటి వాటిని వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 7 నెలల కాలంలో వికలాంగుల సంక్షేమ కోసం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వికలాంగుల కోసం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన 24.84 లక్షల మందికి వెంటనే పెన్షన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్ వెంటనే రెన్యూవల్ చేయాలని కోరారు. వేలాది మంది సదరం సర్టిఫికెట్లపై డాక్టర్స్ సంతకాలు లేకపోవడం వలన ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోయారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడి చట్టం కొత్తగా గుర్తించిన 14రకాల వైకాల్యలకు సదరం సర్టిఫికెట్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తలసేమియా, సికిల్ సెల్, హేమోఫీలియా, అంటీజం, కండరాల క్షీనత, న్యూరోలాజికల్ డిజర్డర్స్ వంటి వైఖల్యాలు కలిగిన వారికి నేటికీ కూడా ప్రత్యేకంగా సదరం సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని, ఆసరా పెన్షన్‌లలో కేంద్ర ప్రభుత్వం వాటా పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జులై 3న రాష్ట్ర వ్యాపితంగా జరిగే ధర్నాలలో వికలాంగులు, వృద్దులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నవతెలంగాణ-వెల్దుర్తి : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం గాంధీ హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ. నవత గౌడ్, తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నర్సింలు 60 సంవత్సరాలు గత వారం రోజుల క్రితం మండల పరిధి మంగళపర్తి గ్రామ శివారులో బైకు అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాల పాలై గాంధీ హాస్పిటల్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు శనివారం ఎస్సై తెలిపారు. నర్సింలు కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
ఆదివారం | 30 జూన్ 2024 | www.navatelangana.com

త్రాగునీటికి పూర్వ విద్యార్థుల చేయూత

● రూ.10 వేల నగదు అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బేగంపేట ప్రభుత్వోన్నత పాఠశాల ఎందరో విద్యార్థులకు చదువును అందించింది. నేడు పాఠశాలలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పాఠశాలలో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కారానికి 2006-07 విద్యా సంవత్సరంలోని పదవ తరగతి విద్యార్థులు త్రాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 వేల నగదును ఇంచార్జీ ప్రధానోపాధ్యాయుడు భరత్‌రెడ్డికి శనివారం ఆర్థిక సహాయంగా అందజేసి చేయూతనందించారు. బేగంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోచిన సహాయమందజేయాలని పూర్వ విద్యార్థులు కోరారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్థిక సహాయమందజేసిన తోటి మిత్రులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు పూల్లూరీ ప్రభాకర్, మనోహర్ రెడ్డి, రామచంద్రం, శ్రీనివాస్, ఖలీమొద్దిన్, పూర్వ విద్యార్థులు ఉప్పులేటి శ్రీనివాస్, సంతోష్, సురేష్, శేఖర్, మధు పాల్గొన్నారు.

రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ



నవతెలంగాణ-వర్గల్

వర్గల్ మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా రైతుల నుంచి వారి అభిప్రాయాలను రాతపూర్వకంగా అధికారులు సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులకు ఆర్థికంగా ఏవిధంగా ఉపయోగంగా ఉంటుందో తెలుసుకోవడానికి స్వయంగా రైతుల ద్వార అభిప్రాయం సేకరణ చేస్తున్నారు. దీనివలన రైతులకు మెరుగైన లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యం. ఈ అభిప్రాయ సేకరణలో మండల వ్యవసాయ అధికారిని శేష శయన, పీఏసీఎస్ ఛైర్మన్ ఇర్రి రామకృష్ణ రెడ్డి, వైస్ చెర్మెన్ మంజుల, వివిధ గ్రామ డైరెక్టర్లు, పీఏసీఎస్ సీఈఓ జితేంధర్ రెడ్డి, ఏఈఓ భారతి, రైతులు పాల్గొన్నారు.

మబ్బులు చూసి విత్తనాలు విత్తిన రైతులు

నవతెలంగాణ- గజ్వేల్

ఈ వర్షాకాలంలో రోజూ వాన మబ్బులు చూసి మురిచిపోయిన రైతులు విత్తనాలు విత్తి బిత్తర చూపులు చూస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో వివిధ పంటలు 5.50 లక్షల ఎకరాలలో పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా పత్తి 1.80 లక్షల ఎకరాలు, వరి 3 లక్షలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచన వేశారు. వర్షాకాలం సీజన్ మొదట్లో కురిసిన వర్షాలకు దుక్కులు దున్నుకున్నారు. కురిసిన తేలికపాటి వర్షాలకు విత్తనాలు వేశారు. ముందస్తుగా వేయడంతో ప్రస్తుతం వర్షం పడకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

మళ్లీ విత్తనాలు విత్తుకోవాలి

రైతులు మళ్లీ వర్షాలు కురిస్తే మళ్లీ విత్తనాలు విత్తుకునే పరిస్థితి వచ్చింది. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల తదితర ప్రాంతంలో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 64 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఒక ఎకరాకు రూ.9 వేల ఖర్చు చేసినట్లు గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు నర్సింహులు చెప్పారు. దీన్ని జిల్లాలో ఇప్పటివరకు రైతులు సుమారు రూ. 50 కోట్ల మెరకు పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. ఇందులో అధికంగా పత్తి సాగుకు ఖర్చు చేశారు. పత్తి విత్తనాలకు వారం రోజుల పాటు వర్షాలు లేకుండా కుళ్ళిపోతున్నాయి. మళ్లీ నాటుకోవాలని రైతులు ఆలోచన చేస్తూ వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. కొన్ని గ్రామాలలో దేవాలయాల్లో పూజలు చేస్తున్నారు. గజ్వేల్ మండలం దాతర్ పల్లి గ్రామంలో ఊరంతా శివాలయంలో ఇంటికో నీటి బిందె తీసుకొచ్చి శివలింగంలో శుభ్రం చేశారు.



మహిళలు బతుకమ్మలు ఆటలు ప్రారంభించారు. గజ్వేల్ వ్యవసాయ సబ్ డివిజన్లో జగదేపూర్, వర్గల్, చేర్యాల, సిద్దిపేట, కుక్కునూరు పల్లి, కొండపాక, ములుగు, కుక్కునూరు పల్లి తదితర చోట్ల పత్తి సాగు చేస్తున్నారు. గజ్వేల్ మండలం కోమటిబండ, దాతర్ పల్లి, ధర్మ రెడ్డిపల్లి, సంగుపల్లి, గజ్వేల్‌లో రైతులు వర్షం కోసం నిత్యం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సాగు విస్తరణ ఇలా ఉంది. సిద్దిపేట జిల్లాలో పత్తి 48.600 ఎకరాలు, వరి 9.265 ఎకరాలు, మొక్కజొన్న4.965 ఎకరాలు, కంది 2.048 పంటలు సాగు చేశారు.

వర్షపాతం లెక్కలు ఇవి

గజ్వేల్ వ్యవసాయ డివిజన్‌లో కురిసిన వర్షాపాతం పరిశీలిస్తే సాదరణంగా 106 మిల్లీ మీటర్లు ఉండగా కురిసింది 38 మిల్లీమీటర్లు మాత్రమే. కొండపాక మండలంలో 99 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 92.8 మి.మీ.ల వర్షం కురిసింది. కొంతవరకు రైతులు ఇక్కడ సాగు ఎక్కువ చేశారు. కానీ తిరిగి మళ్ళీ వర్షం కురవలేదు. రాయపోల్ మండలంలో 140.4 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 93.4 మి.మీ.ల కురిసింది. ఇక్కడ కూడా మొదట్లో కురిసిన వర్షానికి విత్తన విత్తనాలు కొంతవరకు మొలకెత్తి ఎండిపోతున్నాయి.

విత్తనాలు మళ్లీ నాటాలి



రైతు నరసింహులు, గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్: మూడెకరాలు భూమి ఉండగా ఇందులో పత్తి సాగు చేశారు. ఇప్పటికే రూ.18 వేల ఖర్చు వచ్చిందని రైతు చెప్పారు. విత్తనాలు మళ్లీ నాటవలసిన పరిస్థితి వచ్చింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం.

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం



రైతు రాజయ్య గజ్వేల్ మండలం జాబిగామ గ్రామానికి చెందిన రైతు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా పత్తిని సాగు చేశారు. సుమారు రూ.13 వేల వరకు ఖర్చు వచ్చింది. కానీ మొలకెత్త లేకపోయింది. వర్షం కోసం ఎదురు చూస్తున్నాం. వర్షం కురిస్తే మళ్లీ విత్తనాలు పెట్టాల్సి వస్తుంది.



కూలి మీద పడ్డాయి : మహిళా రైతు లచ్చవ్వ .

వ్యవసాయ పనుల కూళ్లు మీద పడ్డాయి. మొదటగా కురిసిన వర్షానికి తమ భూమిలో విత్తనాలు. ఒకరికి కూలి రూ. 300 అందజేశాము. ఎకరానికి పత్తి విత్తనాలు పెట్టాలంటే ఖర్చు బాగా అవుతుంది.

363 రోజులకు చేరిన అల్పాహారం పంపిణీ



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహారం పంపిణీ శనివారం 363 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు నేతి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రతి రోజూ ఉదయం ప్రభుత్వ దవాఖాన వద్ద రోగులకు, వారి బంధువులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. దీని కొరకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ నాగేందర్, లయన్ సామా శ్రీధర్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ డిప్యూటీ సీఎంకి ఘన స్వాగతం



నవ తెలంగాణ-సిద్దిపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కొండగట్టుకు వెళ్తున్న క్రమంలో తెలంగాణా పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షులు, సిద్దిపేట నియోజకవర్గం జనసేన పార్టీ కో ఆర్డినేటర్, రాష్ట్ర యూత్ సెక్రటరీ దాసరి పవన్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి, ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండిపల్లి కృష్ణ, భానుచందర్, పర్శరాములు, కానాపురం సాయి, నరేష్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నవ తెలంగాణ -ములుగు

జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న స్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి వెళ్ళుతున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హైదరాబాద్ నుంచి బయలుదేరగా మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి చౌరస్తా దగ్గర అభిమానులు బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ అభిమానులకు అభివాదం చేసుకుంటూ కొండగట్టుకు బయలుదేరాడు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మండల అధ్యక్షుడు కూతాడి అశోక్ , బీజేపీ ములుగు మండల ఉపాధ్యక్షుడు పుల్లబోయిన బాబుముదిరాజ్, దుర్గం మహేష్ గౌడ్, బీజేవైఎం కార్యదర్శి జూపల్లి జగన్మోహన్, సాగర్ల స్వామి యాదవ్, జూపల్లి గోపాల్,గుర్రాల కరుణాకర్,బీజేవైఎం కార్యదర్శి గంగలమైన శ్రీకాంత్ తదితరులున్నారు

జిల్లాస్థాయి క్రీడా పాఠశాలలకు ఎంపికలు



నవ తెలంగాణ-సిద్దిపేట

జిల్లాస్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలు శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడాధికారి నాగేందర్ తెలిపారు. నాగేందర్ మాట్లాడుతూ 8 యేళ్ల వయసు గల విద్యార్థులు మొతం 66 బాల బాలికలు హాజరుయ్యారని, వీరికి 7 రకాల పోటీలు నిర్వహించి, బాలికలు 10 మంది, బాలురు 16 మంది జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. జూలై 8, 9న హైదరాబాద్‌లో హకీంపేట క్రీడా పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించకపోతే చట్టపరమైన చర్యలు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్,ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని తినుబండారాలు విక్రయించే వ్యాపారులు పరిశుభ్రత పాటించకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని పలు తిను బండారాల వ్యాపార కేంద్రాలను సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గజ్వేల్ పట్టణానికి చెందిన బెంగళూరు అయ్యంగారి బేకిరిని తనిఖీ చేయగా కూల్డ్రింక్స్,తదితర కాలం చెల్లిన వాటిని గుర్తించినట్లు ఆయన తెలిపారు. అందుకు జరిమానా రూ.10 వేలు విధించినట్లు కమిషనర్ తెలిపారు. పట్టణంలో హోటల్లు, బేకరీలలో ఆహార పదార్థాలు తీసుకునే ముందు కాలపరిమితిని పరిశీలించుకోవాలని ఆయన చెప్పారు. కాలం పరిమితి అయిపోయిన వాటిని విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. మున్సిపల్ 2019 సెప్టెంబర్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతు రుణమాఫీ చారిత్రక నిర్ణయం



నవతెలంగాణ - మర్కుక్

రైతు రుణమాఫీ చారిత్రక నిర్ణయమని కాంగ్రెస్ మండలా ధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతులకు ఏకకాలం లో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో వ్యవసాయాన్ని పండగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని చెప్పారు. వరంగల్ రైతు డిక్లరేషన్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 09వ తేదీ మధ్య 5 యేండ్ల కాలంలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలియజేశారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని అశాభావం వ్యక్తం చేశారు.

ఆఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



నవ తెలంగాణ-కొండపాక

సిద్దిపేటలో జూ లై 28వ తేదీన జరిగే ఆఫ్ మారథాన్ పో స్టర్‌ను శనివారం కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఆవిష్కరి ంచా రు. ఆరోగ్యం పరి రక్షణలో భాగంగా సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 కేఎం, 10 కేఎం, 20కేఎం కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధి అమరేందర్ రెడ్డి పేర్కొన్నాడు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వైరల్ అవుతున్న కాంగ్రెస్ వైరం

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాల్లో వైరం రోజు రోజుకు రచ్చకెక్కుతుంది. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి వ్యతిరేకంగా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు వర్గాల మధ్య వైరం రచ్చకెక్కుతుంది. గాంధీభవన్ లెవల్లో ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టమవుతుంది. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవుల విషయంలో పలువురు సీనియర్ నాయకులు నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో గజ్వేల్, వంటిమామిడి, కుక్కునూరుపల్లి, మార్కెట్ కమిటీ ఉండగా కొండపోచమ్మ నాచగిరి దేవస్థానంతో పాటు ఆత్మ కమిటీ చైర్మన్ పదవులు ఉన్నాయి. అయితే పార్టీలో ఆశించిన వారి సంఖ్య రోజురోజుకు పెరగడంతో కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న వైరం వైరల్‌గా మారింది. గాంధీభవన్ చుట్టూ గజ్వేల్ నాయకులే తిరుగుతుండడంతో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు సైతం ఈ నియోజకవర్గంకు చెందిన కాంగ్రెస్ రెండు వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు కనిపిస్తుంది. మార్కెట్ కమిటీలను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి వర్గం పట్టుపడుతుండగా నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులు పార్టీకి కష్టపడ్డ వారికి లేదా అందులో సగం సగం ఇవ్వాలని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్రావు, నాయిని యాదగిరి, మల్లారెడ్డి, భాను ప్రకాష్‌రావు, గంగిశెట్టి శ్రీనివాస్ గుప్త, కొండపాక చెందిన విజయ్ కుమార్, గోపాల్ రావు తదితరులు డిమాండ్ చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. నామినేటెడ్ పదవులు పార్టీకి కష్టపడ్డ వారికి కాకుండా ఇతరులకు ఇస్తున్నారని అందుకే వ్యతిరేకిస్తున్నామని నియోజకవర్గంలో ముఖ్య నాయకులు అంతా చర్చించుకుంటున్నారు. దీంతో పీసీసీ స్థాయి నాయకులు అయోమయానికి గురవుతున్నారు. మంత్రివర్గంలో కొందరు నర్సారెడ్డి వైపు మరికొందరు బండారు శ్రీకాంత్రావు వైపు ఉన్నారని పార్టీ నాయకులు అంటున్నారు. నిన్న మొన్నటి వరకు ఒక్కటిగా ఉన్న గజ్వేల్ కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయి ఇప్పటికే కార్యక్రమాలు చేపడుతున్నారు. మంత్రి కొండ సురేఖ ఒకవైపు, మంత్రి దామోదర్ రాజనర్సింహ మరోవైపు ఉన్నట్లు క్షేత్రస్థాయి కార్యకర్తలు చర్చించుకోవడం జరుగుతుంది. ఏది ఏమైనా గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో లొల్లి గాంధీ భవన్ కు చేరింది.



నిషేధిత గుట్కాల పట్టివేత

● సమాచారం ఇస్తే వివరాలను గోప్యంగా ఉంచుతాం
● ఎస్సై మహేష్, టాస్క్ ఫోర్స్ పోలీసులు



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో నిషేధిత గుట్కాలు, సిగరెట్లు అమ్ముతున్నారని సమాచారం మేరకు పోలీసులు శనివారం పట్టణంలోని హనుమాన్ హోల్‌సెల్ కిరాణా షాప్‌లో తనిఖీలు నిర్వహించి రూ. 25,624 విలువ చేసే గుట్కాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఎస్సై మహేష్, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ హనుమాన్ హోల్‌సెల్ కిరాణా షాప్ యజమాని రాథోర్ నాకుల్ సింగ్ ప్రభుత్వం నిషేధించిన స్మగుడు సిగరెట్లు, గుట్కాలు అంబర్, బ్లూబుల్, అమ్ముచున్నాడని నమ్మదగిన సమాచారంపై తనిఖీ చేసి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం,గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రభుత్వం నిషేధించిన గుట్కాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

అధ్యాపక బృందంపై ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేస్తాం

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్‌రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం బాలికల హాస్టల్ కోసం ఎలాంటి అధికారం లేని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేయడం సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు పక్క జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి వినతిపత్రం ఇవ్వడం అంటే రాజకీయాలు చేస్తున్నారా లేక విద్యాబోధన చేస్తున్నారా అని ప్రశ్నించారు. హాస్టల్ కోసమే అయితే గత సంవత్సరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొట్లాడి సాధించామని అన్నారు. ఏ ఒక్క విద్యార్థినిని కూడా అధ్యాపక బృందం అడ్మిషన్ చేయించలేదని దాని కారణంగా అడ్మిషన్స్ రాలేదని హాస్టల్ ప్రారంభం కాలేదన్నారు. ఎలాంటి అధికారాలు లేని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వద్దకు అధ్యాపక బృందం వెళ్లి హాస్టల్ కావాలని కళాశాల నడిచే సమయంలో బోధన చేయకుండా ఇంటికి వెళ్లి అడగడం సరైన పద్ధతి కాదన్నారు. అధ్యాపక బృందంపై బోర్డు అఫ్ ఇంటర్ మీడియట్ అధికారులకు పిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ ఉపాధ్యక్షుడు తాడూరి భరత్ కుమార్, నాయకులు రాకేష్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

● ఎంపీటీసీకి ఎల్‌ఓసి అందజేత
● కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ- మిరుదొడ్డి

నిరుపేదల సంక్షేమ కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండలం అందే గ్రామానికి చెందిన ఎంపీటీసీ లలితా అనారోగ్యంగా ఉండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వంచే మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసి చెక్కును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎంతగానో దోదపడుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) మిరుదొడ్డి మండలం ఎంపీపీ గజ్జల సాయిలు, మండల అధ్యక్షులు మద్దెల రాజేశం, అందే గ్రామ తాజా మాజీ సర్పంచ్ శంకర్, అల్వాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ కిష్టయ్య, మల్లుపల్లి తాజా మాజీ సర్పంచ్ భూపతి గౌడ్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నగర్ కనకా రెడ్డి, భూపాల్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింలు, పద్మా రెడ్డి, ఇంతియాజ్ రాజిరెడ్డి (టీజేఏస్),తదితరులు పాల్గొన్నారు..

సీఈఐఆర్ టెక్నాలజీతో మొబైల్ ఫోన్ స్వాధీనం

●ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీతో సహాయంతో ఫోన్ స్వాధీనం చేసుకుని తిరిగి బాధితుడికి ఇవ్వడం జరిగిందని సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చింతమడక గ్రామానికి చెందిన కేమ్మసారం చంద్రం తన ఫోన్ పోగొట్టుకుని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ వెబ్సైట్లో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి, బ్లాక్ చేయడం జరిగింది. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించడం జరిగిందని అన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, గుర్తుతెలి యని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొని పోయినా వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చుని, తద్వారా కోల్పోయిన ఫోన్ తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణంలోని యాదవనగర్‌లో గల మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పట్టణ కేంద్రానికి చెందిన మేడిశెట్టి బాలరాజు (55) శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మృతదేహానికి నివాళులర్పించి, మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతునికి భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హిందీ బోధన పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

నవ తెలంగాణ-కొండపాక

మోడల్ స్కూల్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో హిందీ సబ్జెక్టు బోధించుటకు అవర్లీ బేస్డ్ ప్రకారం పనిచేయడం కోసం ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వన్నీసా తెలిపారు. అర్హత కలిగిన వారు సర్టిఫికెట్లతో జూలై 4వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ



నవ తెలంగాణ - కొండపాక

కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం డిక్షనరీలను పంపిణీ చేశారు. 150 విద్యార్థులకు డిక్షనరీలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీ లక్ష్మణ్ , కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శి మధుసూదన్, ఐటీ నిపుణులు రాజ్ కిరణ్, పాఠశాలప్రధానోపాధ్యాయులు బచ్చలి సత్తయ్య, తాజా మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతి నరేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామ పంచాయతీ పరిధిలో కొందరు వ్యక్తులు ఇసుకను మోయ తుమ్మెదవాగు నుంచి దొంగతనంగా తరలిస్తుండగా, ఆ ఇసుకను స్వాధీనం చేసుకుని చర్యల నిమిత్తం తహసీల్దార్ అప్పగించినట్లు రాజగోపాల్ పేట ఎస్సై యూ.భాస్కర్ రెడ్డి తెలిపారు. నంగునూరు రామాలయం బండ చుట్టూ, బండ మీద, ప్రభుత్వ ప్రైవేటు స్థలాల్లో 18 చోట్ల దాదాపు 190 ట్రిప్పుల ఇసుకను డంపు చేశారన్నారు. ఇంకా కొన్ని చోట్ల ఉన్నట్లు తెలిసిందని వాటిని కూడా గుర్తించి స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఇసుక డంపులను శనివారం స్వాధీనం చేసుకొని తగు చర్య నిమిత్తం నంగునూరు తహశీల్దార్‌కు అప్పగించినట్లు వెల్లడించారు.

కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఒక్కటే



నవతెలంగాణ- గజ్వేల్

ప్రజా వ్యతిరేక పాలన చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరు ఒకటేనని గజ్వేల్ పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి ఐల మహేందర్ అన్నారు. శనివారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐల మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఆగం చేస్తున్నారని ఎక్కడ కూడా హామీలు అమలు కావడం లేదని ఆయన అన్నారు. బస్సు ప్రయాణం మినహా మిగతా గ్యారెంటీలు ఎక్కడ అమలు చేస్తున్నారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటికీ గజ్వేల్ రాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గజ్వేల్‌కు రాని పరిస్థితిలో ఉంటే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఎంపీ ఓవైసీ అక్బరుద్దీన్ చేసిన వాక్యాలు విడ్డూరంగా ఉందన్నారు. దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలి



నవ తెలంగాణ-సిద్దిపేట

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మేనిఫెస్టోలో పేర్కొన్న ముదిరాజుల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిద్దిపేటలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజుల చిరకాల వాంఛ అయిన బీసీడీ నుంచి బీసీ ఏలోకి మారుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో అనేక సందర్భాల్లో ప్రస్తావించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందుగానే ఈ సమస్య పరిష్కరించాలని, లేనియెడల త్వరలోనే పోరాటానికి భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటామని అన్నారు. మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు స్థానాన్ని కల్పించాలని, నామినేటెడ్ పదవులలో ముదిరాజులకు అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియనే చేపట్టలేదని, గత ప్రభుత్వం జూన్ మొదటి వారంలోనే చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్లు గాని, చేప పిల్లల పంపిణీ ప్రక్రియ గాని చేపట్టలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడిగే ప్రశాంత్ ముదిరాజ్, సుతారి రాజు ముదిరాజ్, జిల్లెల్ల సుధాకర్ ముదిరాజ్, పడిగె లింగం ముదిరాజ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకి ఐఎస్ఓ గుర్తింపు



నవ తెలంగాణ - సిద్దిపేట

స్థానిక ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాల కి ఐఎస్ఓ గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ తెలిపారు. శనివారం సూర్యప్రకాష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉన్నత విద్యమండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి చేతులమీదుగా ఈ అవార్డును కళాశాల సెక్రటరీ డాక్టర్ నరేందర్ రెడ్డితో కలసి అందుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్వాలిటీ కలిగిన విద్యను అందించడం, వారికి ఉద్యోగ సాధనలో తోడ్పడడం వంటి అంశాలలో ప్రతిభ కళాశాల చూపుతున్న చొరవని ఉన్నత విద్యా మండలి చైర్మన్ అభినందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకి వరుసగా గత నాలుగు సంవత్సరాలనుండి ఐఎస్ఓ గుర్తింపు లభించిందని, దీనికి కృషి చేసిన కళాశాల అధ్యపక బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు.

విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-మద్దూరు

విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం సందర్భంగా దోమలు రాత్రి వేళల్లో ఇళ్లల్లోకి వస్తాయని ప్రజలు దోమ తెరలు వాడాలని సూచించారు.ప్రజలు సురక్షితమైన మంచినీరును తాగాలని, లేదా బోరు పంపు నీరును తాగాలని, అత్యవసర పరిస్థితిలో మంచి నీళ్లను వేడి చేసి, వడబోసి చల్లారిన తర్వాత నీళ్లను తాగాలని, తద్వారా, కలుషిత పోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రభాకర్, వైద్యాధికారి డాక్టర్ సుధీర్ రాజ్,, సిబ్బంది పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటు పడాలి



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని, నిస్సహాయత లేని చిరునవ్వులే లక్ష్యంగా చిన్న పిల్లల్ని ఎవరైనా వెట్టిచాకిరికి గురి చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. శనివారం ఆమె సీపీ ఆఫీస్‌లో జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ నిర్వహణ కోసం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ తదితర డిపార్ట్మెంటు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు మిస్సింగ్ చిల్డ్రన్ కేసులను ట్రేస్ అవుట్ చేయాలని, అన్ని డిపార్ట్మెంట్‌లు కలిసి టీం వర్క్ చేయాలని, బాల కార్మికులు పనిచేసే స్పాట్స్‌ని గుర్తించి టీమ్స్‌తో వెళ్లి రైడ్ చేయాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా ఇప్పటి వరకు 946 మంది పిల్లలను సేవ్ చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా వీధి బాలలను చూసినప్పుడు 1098 లేదా, డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ 87126 67100, ఉమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ 9440700906 లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌లను రిలీజ్ చేసారు. ఈ సమావేశంలో డిడబ్ల్యుఓ శారద, సిసిఆర్బి సీఐ గురుస్వామి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, సిడబ్ల్యుసి చైర్మన్ రాజలింగం, డిసిపిఓ రాము, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు శిక్షలు పడేట్లు చూడాలి

కోర్టు కానిస్టేబుల్ కీలక పాత్ర వహించాలి

కేసులలో నిందితులకు శిక్షలు పడేటట్టు కోర్టు కానిస్టేబుల్ కీలక పాత్ర వహించాలని, క్రమశిక్షణతో పారదర్శకంగా విధులు నిర్వహించి, పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెంచాలని సీపీ. డాక్టర్ బి. అనురాధ అన్నారు. శనివారం సీపీ ఆఫీస్‌లో ఆమె కోర్టు డ్యూటీ విధులు నిర్వహించే సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, కేసులలో శిక్షల శాతం పెంచాలని, నిందితులకు శిక్షలు పడేటట్లు సాక్షులను మోటివేషన్ చేయాలని తెలిపారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులలో ట్రాయల్ సమయంలో సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికారులు తప్పకుండా మానిటర్ చేయాలని సూచించారు. అనంతరం సీఐలు కమలాకర్, శ్రీధర్, ఎస్ఐ నరేందర్ రెడ్డి లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన చట్టాల్లో ఉన్న శిక్షలు గురించి, కోర్ట్ ప్రాసెస్ గురించి తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సీఐ కమలాకర్, ఐటీ కోర్ ఎస్ఐ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామంలో వివక్షత లేకుండా కలిసిమెలిసి ఉండాలి

- రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

గ్రామాల్లో ఎటువంటి వివక్షత లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని బండచెర్లపల్లి గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా గ్రామంలోని దళిత వాడలను సందర్శించారు. ఆనంతరం ఏర్పాట్లు చేసిన సమావేశంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి తెలుసుకున్నారు. అనంతరం ఆర్ఐ బాలయ్య మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి వివక్షతలు లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని రకాల పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రలేఖ. కానిస్టేబుల్ రాకేశ్, మాలమహానాడు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ జాగిలాలతో తనిఖీలు



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో పలు కిరాణా షాపుల్లో పలు ప్రాంతాలలో నార్కోటిక్ డాగ్స్‌తో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ జిల్లా జగదీష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై నార్కోటిక్స్. డాగ్స్‌తో. తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో డ్రగ్స్ గంజాయి ఎవరైనా విక్రయిస్తే 100 డయల్ కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ- రాయపోల్

తాజా మాజీ సర్పంచ్ కేత కనకరాజు కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం కల్పించడం జరిగిందని బీజేపీ దౌల్తాబాద్ మాజీ మండల అధ్యక్షులు పోతరాజు కిషన్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల లింగరాజుపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ కేత కనకరాజు మామయ్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ యజమాని మృతి చెందితే ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోతుందని ఇలాంటి సందర్భంలోనే గుండె ధైర్యంతో ముందుకు పోవాలని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వామి, సురేందర్ రెడ్డి, స్వామి, బొల్లం స్వామి, రామస్వామి గౌడ్, గడ్డమీద స్వామి, బోట్క లక్ష్మణ్, రంజిత్ గౌడ్, బండి రాజు, ముత్యాల చంటి, లింగరాజు పల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



నవతెలంగాణ-గజ్వేల్

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన గజ్వేల్ మండలం అమ్మది పూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వంకాటి పెంటయ్య రోజు మాదిరిగానే పొలానికి ఎద్దును తీసుకెళ్లగా, ఆ ఎద్దు సబ్‌స్టేషన్ పక్కన గడ్డి మేస్తుండగా ప్రమాదవస్తు విద్యుత్ ఘాతానికి గురై ఎద్దు మరణించింది.

ఎస్సీ వసతి గృహం సందర్శన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పోగుల రాజు శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు,మెనూ వివరాలను పాటించాలని వసతి గృహ సిబ్బందికి సూచించారు.విద్యార్థులకు వైద్య పరీక్షలు ప్రతినెల స్థానిక మెడికల్ ఆఫీసర్ నిర్వహించి సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాజు సూచించారు.

బచ్చు రాజు పల్లి లో పౌర హక్కుల దినోత్సవం




నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి గ్రామంలోని హరిజనవాడ అంగన్వాడి కేంద్రంలో శనివారం స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ గంగాధర్ గౌడ్, ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో కుల, వివక్ష చూపినట్లయితే మా దృష్టికి తీసుకురావాలన్నారు. హెూటల్‌లో రెండు గ్లాసుల పద్ధతి విడనాడాలన్నారు. గ్రామంలో కులాలకు అతీతంగా అందరూ అన్నదమ్ముల కలిసి మెలిసి ఉండాలన్నారు. అదేవిధంగా ఆన్ లైన్ బెట్టింగ్‌ల ద్వారా యువత చెడు దారిన పడుతున్నారని. పిల్లలను సెల్ ఫోన్ నుంచి దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. సెల్ ఫోన్‌లోని ఆన్ లైన్ గేమ్‌లతో యువకులు డబ్బులకు ఆశపడి అప్పుచేసి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఆన్ లైన్ మోసాలకు యువత మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాదవ లక్ష్మి, పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, సాయిబాబా, నాగరాజు, వార్డెన్ శ్రీనివాస్, డిపిఎఫ్ అధ్యక్షులు దుబాసి సంజీవ్, ఎమ్మార్వో స్టాఫ్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన

- ఎస్సై శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధి లోని జెడ్చెరువు తాండ గ్రామంలో శనివారం అంగన్వాడి కేంద్రంలో నెలవారి అంగన్వాడి సూపర్వైజర్ ఆధ్వర్య ంలో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు దారిన పడుతున్నారని మత్తు పదార్థాలకు బానిస కాకుండా గ్రామీణ ప్రాంతాలలో డ్రగ్స్ మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అలాగే ఆన్లైన్ మోసాలపై జాగ్రత్తలు వేయించాలన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్ ఫోన్లకు ఆకర్షితులు కాకుండా చదువుపై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే 1930కు, 100కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మి, పోలీస్ సిబ్బంది ఎస్ఐ జయపాల్ రెడ్డి సాయిబాబా, నాగరాజు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో 15 లక్షల మొక్కలు నాటాలి

- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో 15 లక్షల మొక్కలను నాటాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో ఈ సంవత్సరం 15 లక్షల మొక్కలు నాటుటకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని ఇప్పటికే 1.50 లక్షల మొక్కలు రావటం జరిగిందని అన్నారు. వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో 15 లక్షల మొక్కలను నాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ స్పెషల్ సెక్రటరీ షఫీయుల్లా ఖాన్ అధికారులను ఆదేశించారు. శనివారం షఫీయుల్లా ఖాన్ జిల్లాలోని గజ్వేల్ మండలంలోని దాచారంలో అవెన్యూ ప్లాంటేషన్, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, దిలాల్పూర్ గ్రామంలో నర్సరీ పల్లె ప్రకృతి వనం, చేర్యాల మండలంలోని వీరన్నపేట కొత్తదమ్మాటలలో మ్యాంగో ఫిటింగ్, కోకోనట్ బండ్ ప్లాంటేషన్, సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్న గుండవెల్లి, తోర్నాల గ్రామాలలో హార్టికల్చర్ ప్లాంటేషన్, నర్సరీ, పల్లె ప్రకృతివనం, వన మహోత్సవ నిర్వహించబోయే సైట్‌ను పరిశీలించారు. అనంతరం శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలతో సమావేశం నిర్వహించి ఈ సంవత్సరంలో వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లాఖాన్ మాట్లాడుతూ మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు సిద్దిపేట జిల్లా అన్ని రంగాలలో రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఇందుకు అందరికీ అభినందనలు తెలియజేశారు. మొక్కలు కార్బన్డయాక్సైడ్‌ని స్వీకరించి ఆక్సిజన్‌ని అందిస్తాయని మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్క అధికారి ఒక్కొక్క గ్రామాన్ని దత్తత తీసుకొని మొక్కలు నాటి కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నాటిన ప్రతి మొక్క వృక్షంగా ఎదిగే వరకు పర్యవేక్షించాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు జియో టాకింగ్ చేయాలన్నారు. గతంలో నాటి ఏపుగా పెరిగిన మొక్కలు కరెంటు స్తంభాల వైర్లకు తగలకూడదని కట్ చేయడం బాధాకరమైన విషయమని ఇక ముందు ఇలాంటివి జరగకుండా రోడ్డు వెడల్పు, సీసీ రోడ్ల నిర్మాణం వలన మొక్కలను తొలగించే అవకాశం లేకుండా ముందస్తుగా ఆలోచించి మొక్కలను నాటాలన్నారు. హార్టికల్చర్ మొక్కలను నాటేందుకు ప్రాధాన్యతను ఇవ్వాలని, అగ్రికల్చర్ ల్యాండ్లలో కూడా అంతర్ పంటగా నాటాలని అన్నారు. జూలై మొదటి వారంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి ఎంపిక చేసిన గ్రామాలలో మొక్కలను నాటాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమం ద్వారా మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం ప్రకారం త్వరగా మొక్కలు నాటుటకు గుంతలు తీయడం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, జెడ్పీ సీఈఓ రమేష్, డీపీఓ దేవకీదేవి, అడిషనల్ డీఆర్డిఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

రైతు భరోసా అవగాహన సమావేశం

- సాగు చేసే ప్రతీ ఎకరానికి రైతు బందు అందించాలి
- పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి
- ములుగులో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం
- హాజరైన పాలకవర్గం, సంఘ సభ్యులు



నవతెలంగాణ-ములుగు

రైతులు సాగు చేసే ప్రతీ ఎకరానికి రైతు భరోసా' ద్వారా పెట్టుబడి సాయాన్ని అందించాలని పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రం ములుగులో శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం యొక్క అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా' అమలు, విధివిధానాలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పెట్టుబడి సాయాన్ని అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధు పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పెట్టుబడి సాయాన్ని పెంచి యథావిధిగా రైతు బందును రైతులకు వెంటనే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

రైతు భరోసాపై రైతుల అభిప్రాయాల సేకరణ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు భరోసా అమలుకు సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ప్రగతి, పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమేష్ బాబు ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను అధికారులు సేకరించారు. రైతులు సాగు చేసే ప్రతీ ఎకరానికి పెట్టుబడి సాయాన్ని అందించాలని కొందరు, 10 ఎకరాలకు మాత్రమే పరిమితి విధించి నిజమైన రైతులకే రైతు భరోసా అందించాలని మరికొందరు రైతులు భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు రమేష్, భంగ్య, యాదయ్య, రాములుగౌడ్, కళమ్మ, అనంతరెడ్డి, వెంకటేశం, సత్తయ్య ఏఈవో పృథ్వీ, పీఏసీఎస్ సిబ్బంది స్వరూప, అశోక్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం

- ఇబ్బందుల్లో గ్రామాల ప్రజలు
- ఎక్కడ చూసినా బురదమయమే
- పనులు త్వరలో పూర్తి చేయాలంటున్న ప్రయాణికులు



నవ తెలంగాణ-మిరుదొడ్డి

జాతీయ రహదారి నిర్మాణం పనులు నత్తనడకన నడుస్తున్నాయి. అక్బర్ పేట భూంపల్లి మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు మండల కేంద్రానికి రావాలంటే ప్రజలు ఎంతో ఇబ్బందులు పాలవుతున్నారు. ఒకవైపు వర్షం, మరొకవైపు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గుంతల మయంగా మారింది. ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారి తెలిపిన పట్టించుకోవడం లేదని గ్రామ మాజీ సర్పంచ్ సర్ప బుచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నట్లు ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు తప్పనిసరిగా త్వరలో పూర్తి చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు. అక్బర్‌పేట భూంపల్లి, చిట్టాపూర్ గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులు ఆగడంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పాలవుతున్నారు. వాటితో పాటు గ్రామంలో రోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో ప్రయాణికులకు ఇబ్బంది పాలవుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నవారు బురదంగా ఉన్న రోడ్డుపై జారీ ప్రమాదాలకు దారి తీస్తదని, ఇట్టి విషయాన్ని ఉన్నత అధికారం తెలిపిన పట్టించుకోవడం లేదు.

పనులు వేగవంతం చేయాలి



స్వరూప బుచ్చయ్య, సర్పంచ్

గ్రామంలో సైడ్ డ్రమ్స్ పూర్తి కాకపోవడంతో రోజు ప్రమాదాలకు దారితీస్తుంది. వర్షం పడితే బురదంగా మారుతుంది అధికారులు పట్టించుకోని వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారుల్లో ఉన్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో జరిగాయి, కాంగ్రెస్ ప్రభుత్వంగానే ఎందుకు ఆగుతున్నాయో అర్థం కావడం లేదు.

ప్రారంభోత్సవమాయే...వినియోగం లేకపాయే

- వైస్ ఎంపీపీ పోలీసు రాజులు



నవ తెలంగాణ-మిరు దొడ్డి

ఎంతో ఆర్భాటంగా మంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన భవనాలు ఆరు నెలలు గడిచినా వినియోగంలోకి రాకపోవడం సిగ్గుచేటని వైస్ ఎంపీపీ పోలీసు రాజులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన లేదని విమర్శించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి నెలలో మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనంతో పాటు ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. నేటికీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉపయోగంలోకి తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడం జరిగిందన్నారు. ఎలాంటి కనీస సౌకర్యాలు లేకున్నా ఆర్భాటాల కోసం ప్రారంభోత్సవాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా మంత్రి చేతుల మీదుగా ప్రారంభించిన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్స్ సభ్యుడు హైమద్, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బాలరాజు, లింగం, భైరయ్య పలువురు పాల్గొన్నారు.

చేరికల మీద ఉన్న దృష్టి పాలన మీద లేదు

- బీజేపీ మాజీ మండల అధ్యక్షులు కిషన్



నవతెలంగాణ- రాయపోల్

కాంగ్రెస్ సర్కార్‌కు పార్టీ చేరికల మీద ఉన్న దృష్టి పరిపాలనపై లేదని రాష్ట్ర సంక్షేమం అభివృద్ధి గాలికి వదిలేసి వేరే పార్టీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించడం సరికాదని దౌల్తాబాద్ బీజేపీ మాజీ మండల అధ్యక్షులు పోతరాజు కిషన్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలల్లో అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. గద్దెనెక్కిన కాంగ్రెస్ యేడు నెలలు గడుస్తున్న హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అభివృద్ధి అనేది దేవుడెరుగు కనీసం సంక్షేమ పథకాలను కూడా సామాన్య ప్రజలకు అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసి అధికారం కట్టబెట్టినందుకు ప్రజలకు తగిన గుణపాఠం చెప్పుతున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్తారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమ్మరి నర్సింలు, నర్సింలు, సురేందర్ రెడ్డి, స్వామి, బొల్లం స్వామి, రామస్వామి గౌడ్, గడ్డమీద స్వామి, బోట్క లక్ష్మణ్, రంజిత్ గౌడ్, బండి రాజు, ముత్యాల చంటి, లింగరాజు పల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు అనుమతితోనే భూమి బదలాయింపు



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

జగదేవ్‌పూర్ మండలం అంతాయిగూడ గ్రామానికి చెందిన రైతులు సూర కొండయ్య నరసయ్య వారి కుటుంబ సభ్యులు తనపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని గ్రామ మాజీ సర్పంచ్ తిగుళ్ల సత్యం లక్ష్మణ్‌లు అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్యం మాట్లాడుతూ శుక్రవారం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ భూమిని అక్రమంగా పట్టా మార్పిడి చేసుకుంటున్నారని చేసిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కొన్ని సర్వే నెంబర్‌లో యేళ్ల తరబడి కబ్జాలో వున్నప్పటికి పట్టాలు అమలు కాని విషయం గ్రామస్తులందరికీ తెలిసిందేనని, సుమారు 100 ఎకరాలకు పైగా భూమి కబ్జాలో ఉన్నప్పటికీ ఎవ్వరూ పట్టా చేసుకోలేదన్నారు. ఇప్పటికీ ఆ సమస్య అలాగే ఉందని తాము మాత్రం కోర్టు ఆర్డర్ ద్వారా భూ యజమానులతో మాట్లాడుకొని తమ వారసత్వ భూమిని మాత్రమే పట్టా చేసుకుంటున్నామన్నారు. తనపై బురదజల్లే ఉద్దేశంతో రైతులను తప్పుదోవ పట్టించి తనపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని తెలిపారు. గ్రామంలో భూ సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా తనపై ఆరోపణలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం





నవ తెలంగాణ- మిరుదొడ్డి

ఆటోను ఢీకొన్న బైక్ ముగ్గురికి తీవ్ర గాయాలు ఎదురెదురుగా వస్తున్న బైక్ ఆటోను ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మిరుదొడ్డి మండలం ధర్మారం, ఆరేపల్లి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు సిద్దిపేటకు చెందిన ఎండీ ఖాదీర్, ఎండీ సోహెల్ మండలంలోని మల్లుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌కు వెళ్తున్న క్రమంలో ధర్మారం గ్రామం శివారులో ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ పై వెళ్తున్నా ఖాదీర్ ఎండీ సోహెల్‌కు, ఆటో డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బైకు అతివేగంగా రావడం మూలంగా ఈ యొక్క ప్రమాదం జరిగిందని స్థానికులు తెలుపుతున్నారు. వీరిని 108 సాయంతో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు 108 సిబ్బంది ప్రమాదం జరిగిన చోట వారు చేసిన సేవలు మరువలేనివని స్థానికులు 108 సిబ్బందిని అభినందించారు.

ఉచిత బస్ పాసుల పంపిణీ

నవతెలంగాణ-రాయపోల్

దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న వివిధ గ్రామాల విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లను ఎంపీటీసీ ఆది వనిత వేణుగోపాల్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆది వనిత వేణుగోపాల్ మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో ఆధ్వర్యంలో ఉచిత బస్సు పాసులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ వారు ప్రయాణికులకు అందుబాటులో యెల్లవేళలా బస్సులు నడుపుతున్నారని, ప్రైవేటు వాహనాలలో ప్రయాణం చేసి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందన్నారు. అలాగే గజ్వేల్, రామాయంపేట మార్గంలో ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు ఉందని ప్రయాణీకులందరూ వాటిని వినియోగించుకోవాలన్నారు. అలాగే వికలాంగులకు, విద్యార్థులకు ఎల్లవేళలా బస్సులు అందుబాటులో ఉంటాయని బస్సు పాసులు కోసం దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, దౌల్తాబాద్ విలేజ్ బస్ ఆఫీసర్లు దొంతుల కృష్ణ, కౌకూరి సిద్దిరాములు, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవనం పూర్తి



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని నర్సనపేట గ్రామంలో రూ. 72 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం చేపడుతున్నారు. శనివారం స్లాబ్ నిర్మాణం వేసే క్రమంలో ఇసుకను సరైన మోతాదులో వేయడం లేదని, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో సంబంధిత శాఖ ఏఈ వచ్చి సదరు కాంట్రాక్టరతో మాట్లాడి, ఇసుకను తప్పించి స్లాబ్‌ను వేయించారు. దీంతో నాలుగు సంవత్సరాల క్రితం మంజూరైన గ్రామ పంచాయతీ భవనం భూ తగాదాల వల్ల నిర్మాణానికి నోచుకోలేకపోయింది. ఏదేమైనా శనివారం స్లాబ్ వేయడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా చందు



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తా ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందును శనివారం యూనియన్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు బంక చందు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు చింతల ఐలయ్య , ఉపాధ్యక్షులు, బదనపురం రాజయ్య, ప్రధాన కార్యదర్శి సుంచు అనిల్, కోశాధికారి బండి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నంగునూరి రాము, సహాయ కార్యదర్శి గంటల లింగమూర్తి, ముఖ్య సలహాదారులు. వడ్డేపల్లి రాజేశం, చిట్టంపల్లి మహేందర్, కోదముంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.